నవతెలంగాణ

www.navatelangana.com

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల

కుమురం భీం-ఆసిఫాబాద్

శుక్రవారం 24 మార్చి 2023

1

సంచలన తీర్పుతో రోడ్డు బ్లాక్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఓ స్థలం విషయంలో కోర్టు ఇచ్చిన తీర్పుతో సంచలనం నెలకొంది. పట్టణంలోని రాణీసతీజి కాలనీలోని సాయిపంచవటి హోటల్ ఉన్న స్థలంతో పాటు పరిసర ప్రాంతంలో ఉన్న తన స్థలాన్ని ఓ డాక్టర్ అక్రమంగా విక్రయించారని సోమ గంగారెడ్డి 22 ఏండల క్రితం కోర్టును ఆశ్రయించారు. అన్నీ పరిశీలించిన కోర్టు ఈ స్థలం గంగారెడ్డికి సంబంధించిందని తీర్పును వెల్లడించింది. దీంతో తాత్కాలికంగా ఆ రోడ్డును బ్లాక్ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా వన్ టౌన్ పోలీసులు బందోబస్తు చేపట్టారు.

పాఠశాల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మూత్రశాలలు, తాగునీరు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పొచ్చెర జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ట్రాన్స్‌ఫార్మర్‌తో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వీటిని పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసినిరెడ్డి అన్నారు. ఈ విషయమై గురువారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నాలుగు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతుల పొలాలు సర్వే చేయించి నష్టపరిహారం అందించాలని కోరుతూ కిసాన్ మోర్చా నాయకులు సతీష్‌రెడ్డితో కలిసి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆమె వెంట నాయకులు మోహన్ అగర్వాల్, గటిక క్రాంతి కుమార్, తోకల నరేష్, అశాంత్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని రోడ్డెక్కిన విద్యార్థులు



నవతెలంగాణ-ఉట్నూర్

తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని గిరిజన పాలిటెక్నిక్ విద్యార్థులు రోడ్డెక్కారు. గిరిజన పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేసినప్పట్నుండి ఇబ్బందులు పడుతూనే ఉన్నామని విద్యార్థులు తెలిపారు. ముఖ్యంగా తాగేందుకు నీరు, హాస్టల్‌లో భోజనం సక్రమంగా పెట్టడం లేదని, చదువుకోవడానికి పుస్తకాలు లేవని పేర్కొన్నారు. తమకు కనీస సౌకర్యాలు కల్పించాలని గతంలో కళాశాల నుంచి ఐటీడీఏ వరకు ర్యాలీగా వెళ్లి సమస్యలు విన్నవించినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌తో మధ్యాహ్న సమయంలో ఎర్రని ఎండలో రోడ్డుపై ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని అధికారులతో చర్చించాలని, ధర్నా చేయడం సరికాదని విద్యార్థులకు సూచించారు. అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలపడంతో ధర్నా విరమించారు.

గ్రామ సర్పంచులకు సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

దీన్ దయాల్ ఉపాధ్యాయ ఉత్తమ గ్రామ పంచాయతీలుగా మండల స్థాయి అవార్డుకు ఎంపికైన సర్పంచ్‌లను ఎమ్మెల్యే జోగు రామన్న ఘనంగా సత్కరించారు. జీవనోపాధి, ఆరోగ్యం, పిల్లలతో స్నేహపూర్వకం, సరిపడా నీటి వనరులు, పచ్చదనం పరిశుభ్రత, మౌలిక సదుపాయాలు, సామాజిక భద్రత, సుపరిపాలన, మహిళా స్నేహపూర్వకం వంటి తొమ్మిది విభాగాల్లో ఉత్తమంగా నిలిచిన గ్రామాలను ఎంపిక చేసి ప్రశంసా పత్రాలతో సత్కరించారు. మావల మండలంలోని మూడు గ్రామాలు అవార్డులకు ఎంపిక కాగా ఆయా గ్రామాల సర్పంచులను శాలువాలతో సత్కరించి ప్రశంసా పత్రాలను అందజేశారు. అదేవిధంగా మండలానికి చెందిన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మావల సర్పంచ్ దొగ్గలి ప్రమీల, బట్టి సావర్గాం సర్పంచ్ రాగం గంగమ్మ, వాగాపూర్ సర్పంచ్ మడావి మయూరి, బీఆర్ఎస్ నాయకులు గంగుల కిరణ్, గోవర్ధన్ పాల్గొన్నారు.

నేరడిగొండ : మండలంలోని 16 గ్రామపంచాయతీ సర్పంచులను గురువారం ఎంపీడీవో సమావేశం మందిరంలో సన్మానించారు. జెడ్పీటిసి అనిల్ జాదవ్ హాజరై ఎన్నికైన సర్పంచులను ఎంపీపీ సజన్ రాథోడ్, ఎంపీడీవో సమద్, ఎంపీఓ శోభనతో కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు పండరి, భీంరావు, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, కో ఆప్షన్ సభ్యులు లాలు, నాయకులు గాదె శంకర్, గంగారాం, సుజిల్, జనార్ధన్, దేవేందర్‌రెడ్డి, యాదవ్‌రావు, గణేష్, అంబాజీ పాల్గొన్నారు.

సేవాలాల్ చూపిన మార్గంలో నడవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ప్రతి ఒక్కరు సేవాలాల్ చూపిన మార్గంలో నడువాలని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ అన్నారు. నార్నూర్ మండలం కొత్తపెల్లి నుండి సుమారు 2వేల మంది భక్తులు పాదయాత్రగా మహారాష్ట్రలోని పౌరాదేవి ఆలయానికి బయలుదేరారు. గురువారంతో ఉట్నూర్ మండలంలోని ఎక్స్ రోడ్డుకు చేరుకున్నారు. అక్కడ సంత్ సేవాలాల్ జెండా ఆవిష్కరించి పూజలు చేశారు. పాదయాత్రంలో జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ పాల్గొని భక్తులనుద్దేశించి మాట్లాడుతూ బంజార సమాజంలో భక్తి, భావన, ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు సేవాలాల్ మహారాజ్ హితబోధ చేశారని గుర్తుచేశారు. అందరూ భక్తి మార్గంలో పయనించాలని, అప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. భక్తులకు విశ్రాంతి కొరకు మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ టెంట్ ఏర్పాటు చేసి పండ్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, బీజేపి నాయకుడు రాథోడ్ రితీష్, ఉమ్మడి జిల్లా గజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్యాంనాయక్, సర్పంచులు జాదవ్ హరినాయక్, సునిల్ జాదవ్, భక్తులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

విశ్వబ్రాహ్మణ సంఘ మండల నూతన కార్యవర్గన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎల్లేశ్వర్ గంగాధర్, ఉపాధ్యక్షులుగా మండజీ రమేష్, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా శంకర్, కోశాధికారిగా లింబన్న, కార్యదర్శులుగా మండజీ రాము, రాజశేఖర్ ఎన్నికైనట్లు సంఘ సభ్యులు తెలిపారు.

704 మంది విద్యార్థులు గైర్హాజరు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా 7వ రోజు గురువారం ఫస్ట్ ఇయర్ గణితం, జువాలజీ, హిస్టరీ పరీక్షకు 704 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్ తెలిపారు. మొత్తం 9095 మందికిగాను 8391 మంది విద్యార్థులు హాజరయ్యారు.

అనారోగ్యంతో ఉన్న యాచకుడిని ఆస్పత్రికి తరలింపు

బాసర : మండలం కేంద్రంలోని రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతంలో గురువారం అపస్మారక స్థితిలో ఉన్న యాచకుడిని హాస్పిటల్‌కు తరలించారు. అనారోగ్యంతో బాధపడుతూ ఎటూ కదలలేకపోతున్న యాచకుడి పరిస్థితి చూసి చలించి పోయిన కోఆప్షన్ మెంబర్ సయ్యద్ అలీ, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. 108 అంబులెన్స్ ద్వారా భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

నార్నూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని గురువారం డిఈసి సభ్యులు మాధవ్‌రావ్, శ్రీనివాస్ తనిఖీ చేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని చీఫ్ సూపరింటెండెంట్ ఉదయ్‌కుమార్‌ను ఆదేశించారు. ఇంటర్ మొదటి సవత్సరం నాలుగో రోజు కొనసాగిన పరీక్షకు మొత్తం 239 మంది విద్యార్థులు పరీక్ష రాయల్సి ఉండగా అందులో ఆరుగురు పరీక్షకు గైర్హాజరయ్యారని డిపార్మెంట్ ఆఫీసర్ శ్రీలత, కళాశాల ఇన్‌చార్జి బాలాజీ కాంబ్లె తెలిపారు.

బీజేపీని గద్దె దించితేనే మనుగడ..!



- వ్యాపారులు, కార్పొరేట్లకు దేశాన్ని అప్పగిస్తోంది
- ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకోవాలి
- సీపీఐ(ఎం) బహిరంగ సభలో వక్తల పిలుపు
- జిల్లాలో ఘనంగా ప్రారంభమైన జనచైతన్య యాత్ర
- భారీ ద్విచక్ర వాహన ర్యాలీ..ఎరుపెక్కిన జిల్లా కేంద్రం





గుస్సాడీలతో కలిసి నృత్యం చేస్తున్న బీవీ.రాఘవులు, ఎస్.వీరయ్య

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్ అర్బన్, ఆదిలాబాద్‌టౌన్

ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారి, కేంద్రంలో నియంతృత్వ పాలన సాగిస్తున్న బీజేపీని గద్దె దించితేనే మనగడ సాగించగలమని వక్తలు పిలుపునిచ్చారు. పేదల సంక్షేమాన్ని మరిచి వ్యాపారులు, కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ దేశాన్ని వారికి అప్పగిస్తోందని మండిపడ్డారు. కుల, మతాల మధ్య వైషమ్యాలు పెంచి కలహాలు సృష్టిస్తోందని తెలిపారు. బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జనచైతన్య యాత్ర చేపట్టింది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం ఎదుట గురువారం నిర్వహించిన బహిరంగ సభలో వివిధ పార్టీల నాయకులు హాజరై మాట్లాడారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య నేతృత్వంలో సాగే ఈ యాత్రకు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అంతకుముందు నిర్వహించిన సభలో ముందుగా భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, కుమురంభీం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీవీ.రాఘవులు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ పాలనలో దేశం ప్రమాదకర పరిస్థితులు ఎదుర్కొంటుందని పేర్కొన్నారు. రాజ్యాంగ, ప్రజాస్వామ్య హక్కులను పూర్తిగా కాలరాస్తోందని వ్యాఖ్యానించారు. ఎస్.వీరయ్య మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం పేదల ఉసురుపోసుకుంటుందని చెప్పారు. భగత్‌సింగ్ దేహం కంటే దేశం ముఖ్యమని చెబితే మోదీ ప్రభుత్వం దేహం కోసం దేశాన్ని అమ్మేస్తోందని వ్యాఖ్యానించారు. జీఎస్‌టీ పేరుతో నిధులన్ని తన వద్దే ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వాల దగ్గర డబ్బులు లేకుండా చేస్తోందని మండిపడ్డారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, మత సామరస్యం, లౌకిక విలువల కోసం ఈ జన చైతన్య యాత్ర చేపడుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా సీసీఐ భూనిర్వాసితులు, ఐకేపీ వీఓఏలు వినతిపత్రం అందించారు.

వ్యాపారులకు దేశాన్ని అప్పగిస్తోంది : రాథోడ్ బాపురావు, బోథ్ ఎమ్మెల్యే

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వ్యాపారులు, కార్పొరేట్లకు దేశాన్ని అప్పగిస్తోంది. దేశాన్ని ముక్కలు చేసే ప్రయత్నం చేస్తోంది. దేశ ప్రజల హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఉంది. సీపీఐ(ఎం) ఆదిలాబాద్ జిల్లా నుంచే జనచైతన్య యాత్ర ప్రారంభించడం శుభపరిణామం.

దేశాన్ని ఆగం చేసే పరిస్థితి : అడ్డి భోజారెడ్డి, డీసీసీబీ చైర్మెన్

బీజేపీ పరిపాలనలో దేశం ఆగమైన పరిస్థితి ఉంది. తొమ్మిదేండ్లలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తామని చెప్పి చేయలేదు. పరిశ్రమలను ప్రయివేటీకరిస్తోంది. ఉన్న సీసీఐ పరిశ్రమను తెరిపించకుండా కొత్త వాటిని కూడా అడ్డుకుంటోంది. దేశంలోని పార్టీలన్ని ఏకమైన బీజేపీని పారద్రోలాలి.

భారీ ర్యాలీ..ఎరుపెక్కిన జిల్లా కేంద్రం

జన చైతన్య యాత్రలో భాగంగా ముందుగా ఆదిలాబాద్ పట్టణంలో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డీజీ.నర్సింహా జెండా ఊపి ప్రారంభించారు. ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ వినాయక్‌చౌక్, అశోక్‌రోడ్, గాంధీచౌక్, అంబేద్కర్ చౌక్, నేతాజీచౌక్ మీదుగా బస్టాండ్ వరకు అక్కడ్నుంచి ప్రధాన రహదారి గుండా సభా ప్రాంగణానికి చేరుకుంది. భారీ సంఖ్యలో వాహనాలతో నాయకులు, కార్యకర్తలు ఎరుపు టీషర్టులు ధరించి పాల్గొనడంతో జిల్లా కేంద్రం ఎరుపుమయంగా మారింది. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంకా రాఘవులు, అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, సీనియర్ నాయకుడు బండి దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యులు మంజుల, ముకినేపల్లి గంగన్న, బొజ్జ ఆశన్న, బైరీ సోమేష్, నాయకులు రెంజర్ల ప్రవీణ్, సురేందర్, ఐద్వా నాయకులు జమున, లలిత, వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

మతోన్మాద పార్టీలకు చోటు లేదు : బండారు రవికుమార్, సీపీఐ(ఎం) జిల్లా ఇన్‌ఛార్జీ

మత సామరస్యానికి నిలయంగా ఉన్న ఆదిలాబాద్‌ను అగ్నిగుండంలా మార్చేందుకు మతోన్మాద శక్తులు ప్రయత్నం చేస్తున్నాయి. జిల్లాలో మత సామరస్యాన్ని కాపాడుకుంటాం. ఇక్కడ మతోన్మాద పార్టీలకు చోటు లేదు. భావ సారుప్యత, జిల్లా అభివృద్ధి కోసం అందరం కలిసి పనిచేయాలి. ప్రజల మధ్య ఐక్యత కొనసాగాలి. పోడు భూముల కోసం పార్టీ పెద్ద ఎత్తున పోరాటం చేసింది.

జిల్లాకు కేంద్రం చేసిందేమీ లేదు : దర్శనాల మల్లేష్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం జిల్లా అభివృద్ధికి చేసిందేమీ లేదు. గత ఎన్నికల్లో బీజేపీని గెలిపించి ఢిల్లీకి పంపించినా ఉపయోగం లేదు. సీసీఐని పున ప్రారంభించలేదు. ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైను లేదు. విమానాశ్రయం కేటాయించలేదు. బీజేపీ పాత కాలపు సమాజాన్ని స్థాపించాలని ప్రయత్నిస్తోంది. మనధర్మశాస్త్రాన్ని అడ్డుకోవడం కోసమే ఈ చైతన్య యాత్ర నిర్వహిస్తున్నాం. కులాలు, మతాల పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తోంది.

ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలు ఇవి : సాజిద్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీలు కూడా ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయి. కాంగ్రెస్ హయాంలోనే ప్రజలు సుభిక్షంగా ఉన్నారు. బీజేపీ ప్రభుత్వంపై పోరాటానికి భవిష్యత్తులో వామపక్షాలతో కలిసి పనిచేస్తాం. మిగితా పార్టీల కంటే సీపీఐ(ఎం) ప్రజా పోరాటాల్లో ముందు వరుసలో ఉంది.

కార్పొరేట్లకు దోచిపెడుతోంది : గండ్రత్ సుజాత, ఏఐసీసీ సభ్యురాలు

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజల సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతోంది. అధికారంలోకి వస్తే నల్లధనాన్ని తీసుకొస్తామని చెప్పి ప్రజలను మోసగించింది. గిరిజన యూనివర్సిటీ రాలేదు. సీసీఐని తెరిపించలేదు.

కమ్యూనిస్టులు ఐక్యంగా పోరాడాలి : ముడుపు ప్రభాకర్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి

కమ్యూనిస్టులు ఐక్యంగా పోరాటాలు చేసి ప్రజలకు న్యాయం చేయాలి. గతంలో యూపీఏ ప్రభుత్వంలో కమ్యూనిస్టులు కలిసి ఉన్న సమయంలో పేదల సంక్షేమం కోసం ఉపాధిహామీ, సమాచారహక్కు చట్టాలను తీసుకొచ్చాం. మోదీ ప్రభుత్వం నల్ల చట్టాలను తీసుకొచ్చి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది.

సీపీఐ(ఎం) జనచైతన్య యాత్ర ప్రారంభ దృశ్యమాలిక



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య



భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు



ప్రజానాట్య మండలి కళాకారుల ఆటాపాట



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి



బైక్ ర్యాలీలో బీవీ.రాఘవులు, రాష్ట్ర నాయకురాలు జయలక్ష్మి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షులు సాజిద్‌ఖాన్



ర్యాలీని ప్రారంభిస్తున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ.నరసింహా



మాట్లాడుతున్న ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత



బీవీ.రాఘవులకు వినతిపత్రం అందజేస్తున్న సీసీఐ భూనిర్వాసితులు



బహిరంగ సభలో పాల్గొన్న ప్రజలు



వీరయ్యను సన్మానిస్తున్న డీసీసీ అధ్యక్షులు సాజిద్‌ఖాన్



ఆదిలాబాద్ నుండి నిర్మల్ జిల్లాకు బయల్దేరిన యాత్ర

సోనాపూర్‌లో ఆర్మీ జవాన్లుకు సన్మానం

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని సోనాపూర్ గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు సోదరులు కసావత్ ఫతే సింగ్, ప్రతాప్‌సింగ్‌లు ఇటీవల ఇండియన్ ఆర్మీ జవాన్‌గా ఎంపికయ్యారు. గురువారం శిక్షణకు వేలుతున్న వారిని గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గ్రామ సర్పంచ్ రాథోడ్ రామారావ్ శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. దేశ సేవకోసం ఇద్దరి కొడుకులను ఆర్మీకి పంపుతున్న తల్లిదండ్రులను అభినందించారు. అనంతరం విద్యార్థులు జవాన్లకు సెల్యూట్ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, గ్రామస్తులు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

నవతెలంగాణ-జైనథ్

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన జైనథ్ మండల కేంద్రం సమీపంలో చోటు చేసుకుంది. ఏఎస్సై ఆత్మారాం తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని వణి మండలంలోని బార్ద గ్రామానికి చెందిన బాబాడే బాపురావు(60), బేలలోని తమ బంధువులను కలిసేందుకు ఉదయం ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. జైనథ్ గ్రామ సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడటంతో తలకు, మోకాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయన అక్కడిక్కడే మృతి చెందాడు. మృతదేహన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై తెలిపారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



నవతెలంగాణ-నార్నూర్

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తహసీల్దార్ అర్క మోతీరామ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ తొడసం నాగోరావు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలను సందర్శించారు. వారం రోజుల కింద 8 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. దీనికి గల కారణాలను ప్రిన్సిపల్ ఉపేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థినుల ఆరోగ్యంపై ఆరా తీశారు. వారు కొలుకున్నట్టు పేర్కొన్నారు.

తహసీల్దార్‌ను సన్మానించిన తొడసం వంశీయులు

నవతెలంగాణ-నార్నూర్

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ అర్క మోతీరామ్‌ను తొడసం వంశీయులు గురువారం మండల కేంద్రంలోని ఖాందేవ్ ఆలయంలో శాలువా కప్పి సన్మానించారు. ప్రజలు ఎదుర్కొంటున్న భూసమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ తొడసం నాగోరావు, సర్పంచ్ ఆత్రం పరమేశ్వర్, తొడసం గోపాల్, పూసం ఇస్రు, రెవెన్యూ సిబ్బంది అల్లా సింగ్, సతీష్ ఉన్నారు.

పందుల సంచారాన్ని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు



నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

పట్టణంలో పందుల సంచారంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి, పందుల సంచారాన్ని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్ అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో పందుల యజమానులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని వీధుల్లో పందుల సంచారం ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వారికి వివరించారు. స్పందించిన పందుల యజమానులు పది రోజుల్లోగా పట్టణంలో పందుల సంచారాన్ని పూర్తిగా అరికడతామని తెలిపారు. ఎక్కడ పందులు సంచరించకుండా చర్యలు తీసుకుంటామని లిఖితపూర్వకమైన హామీ ఇచ్చారు. దీంతో పందుల సంచారాన్ని అరికట్టేందుకు పది రోజుల గడువును యజమానులకు ఇచ్చారు. ఈ వెసులుబాటును సద్వినియోగం చేసుకొని వెంటనే పందుల సంచారాన్ని అరికట్టాలని లేని పక్షంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ ప్రత్యేక సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రత్నాకర్ రావుతో పాటు పందుల యజమానులు ఉన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

నవతెలంగాణ-సిరికొండ

ఇటీవల సిరికొండ మండల తహసీల్దార్‌గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన ఇస్తార్ వర్ణను గురువారం మండల నాయకులు శాలువాతో సన్మానించారు. మండల అభివృద్ధికి సహకరించాలని తహసీల్ధార్ కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నర్మద, ఎంపీటీసీ పర్వీన్, ఉపసర్పంచ్ తోకల చిన్న రాజన్న, నాయకులు పెంటన్న, ఇక్బాల్, రంజాన్, లతీఫ్, అబ్బు హుస్సేన్, అజ్గర్, ఎగ్గిడి మల్లారెడ్డి పాల్గొన్నారు.

లక్కీడ్రా ద్వారా మైనార్టీ రుణ లబ్ధిదారుల ఎంపిక



నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మైనార్టీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేశారు. మండలానికి 12 యూనిట్లు మంజూరు కాగా 80 మంది దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఎంపీడీఓ సురేష్, ఎంపీపీ అమృత్‌రావు అధ్యక్షతన లబ్దిదారుల సమక్షంలో లక్కీడ్రా నిర్వహించారు. మొత్తం 12 యూనిట్లు కాగా 9 యూనిట్ల కోసం లక్కీడ్రా నిర్వహించారు. ఒక యూనిట్ వికలాంగుల కోసం, రెండు యూనిట్లు కలెక్టర్ ఎంపిక చేస్తారని అన్నారు. ఒక్కొక్కరికి రూ. లక్ష వరకు సబ్సిడీ రుణాలు మంజూరు అయ్యాయని ఎంపీడీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ అతుల్ కుమార్, ఏపీఓ శేషారావ్, సర్పంచ్ నర్మద పెంటన్న, ఎంపీటీసీ పర్వీన్, ఉప సర్పంచ్ తోకల చిన్న రాజన్న, నాయకులు పెంటన్న, ఇక్బాల్, లతీఫ్, రంజాన్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో కనీస వసతులు కల్పించడంలో విఫలం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తామని గొప్పలు చెప్పుకునే బీఆర్ఎస్ ప్రభుత్వం పాఠశాలల్లో కనీస వసతులు కల్పించడంలో మాత్రం వెనకబడిందని బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసినిరెడ్డి అన్నారు. విద్యార్థుల తల్లి దండ్రుల కోరిక మేరకు ప్రభుత్వ బాలికల పాఠశాలను, ఆదిలాబాద్ రూరల్ మండలం పొచ్చర పాఠశాలను గురువారం సందర్శించి, విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో మూత్రశాలలు, తాగునీరు లేక విద్యార్థినులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలాగే పొచ్చెర పాఠశాల అవరణలో ఉన్న విద్యుత్ నియంత్రిక వల్ల బయటకి రావాలంటేనే బయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. దీనిపై స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆమె వెంట నాయకులు అల్లూరి కాంత, ఉప సర్పంచ్ రమేష్, గ్రామస్తులు చిట్టెటి నరేష్ రెడ్డి, అల్లూరి నవీన్ రెడ్డి, మద్దికుంట్ల నారాయణ, వెంకన్న ఉన్నారు.

దళిత యువకుని హత్య సూత్రధారిని శిక్షించాలి

- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ఆంధ్రప్రదేశ్ కాకినాడ జిల్లా తొండంగి మండలం శృంగవృక్షం గ్రామంలోనీ దళితవాడపై దాడిచేసి నడిపల్లి రాము అనే యువకుడిని హత్య చేసిన ఆధిపత్య దురహంకారులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు అన్నారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు జితేందర్ పవర్ అధ్యక్షతన జరిగిన జిల్లా నాయకత్వ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లా తొండంగి మండలం తొండంగి గ్రామానికి చెందిన దళిత యువకుడు నడిపల్లి రాముని శృంగవృక్షం గ్రామంలో మార్చి 21న రాత్రి దాడిచేసి హత్యచేసిన ఆధిపత్య దురహంకారులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ప్రకారం అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో జరుగుతున్న గ్రామ దేవత జాతరకు వెళ్లిన దళిత యువకులపై కులదురహంకారంతో దాడి చేయడమేగాకుండా దళిత పేటలోకి వెళ్లి ఇండ్లలో ఉన్నవారిపై దాడి చేసి అనేక మందిని గాయపరిచారిచారని ఆరోపించారు. ఈ దాడిలోనే దళిత యువకుడు నడిపల్లి రాము మరణించాడని మండిపడ్డారు. ప్రస్తుతం ఆ గ్రామంలోని దళితులు భయకంపితులై బిక్కుబిక్కు అంటూ బ్రతుకుతున్నారని అన్నారు. దాడికి నాయకత్వం వహించిన ముఖ్యుల్ని ఇంత వరకూ పోలీసులు అరెస్టు చేయలేదని కేసును నీరుగార్చే ప్రయత్నం జరుగుతోందని అనుమానం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు రక్షణ కల్పించాలని అన్నారు. గాయపడిన వారికి మెరుగైనవైద్యం అందించాలని కోరారు. పల్లెలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. మరణించిన రాము కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, రెండు ఎకరాలు భూమి, ఉద్యోగం, ఇంటి స్థలం, ఇల్లు కట్టి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఇతర బాధితులకు రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించి, దళిత వాడకు రక్షణ కల్పించాలని అన్నారు. రాష్ట్రంలో అనేకచోట్ల దళితులపై దాడులు కొనసాగుతున్నాయని పోలీసులు దళితులకు రక్షణ కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు ప్రకారం కలెక్టర్, ఎస్పీలు శృంగవృక్షం గ్రామాన్ని సందర్శించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రేంజర్ల ప్రవీణ్, నాయకులు పవార్ జితేందర్, జి.స్వామి, రాహుల్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి



నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండల కేంద్రంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జీ గంగాధర్ గౌడ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం గులాబీ శ్రేణులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముందుగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి సభా స్థలానికి చేరుకున్నారు. సభను ఉద్దేశించి మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ శ్రేణులు సమన్వయంతో పాటు మరింత బలోపేతమే లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించేలా ప్రతి ఒక్క కార్యకర్త పని చేయాలని అన్నారు. పార్టీ శ్రేణులందరినీ పార్టీ విజయంలో భాగస్వామ్యం చేసేలా కార్యచరణ చేయాలని నాయకులకు సూచించారు. బీఆర్ఎస్ పార్టీలో సభ్యత్వం పొందిన ప్రతీ కార్యకర్తను కడుపులో పెట్టుకొని చూసుకుంటామని పేర్కొన్నారు. నర్సాపూర్ గ్రామం కొత్త మండలంగా ప్రకటించాక ఎంతో అభివృద్ధి చెందిందని, అన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేసుకోగలుతున్నామని పేర్కొన్నారు. దేవాదాయ శాఖ మంత్రి పదవిని చేపట్టడంవల్ల జిల్లాలోని ప్రతీ గ్రామంలో ఆలయాలు అభివృద్ధి చేసుకోగలుతున్నామని అన్నారు. రాష్ట్రంలో ప్రతీ సామాజిక వర్గానికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని అందుకే అందరూ బీఆర్ఎస్ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు.

అడ్డుకున్న బీజేపీ శ్రేణులు...

ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి కాన్వాయ్ బీజేపీ నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. పేపర్ లీకేజీ గురించి మంత్రి మాట్లాడుతూ నిరుద్యోగ యువత మనోభావాలు దెబ్బతినేలా పేపర్ లీకేజీ జరగడం సర్వసాధారమని అన్నందుకు, గతంలో దళిత బంధు అందరికీ చేరలేదని అడిగిన మహిళల పట్ల కించపరిచేలా మాట్లాడినందుకు బీజేపీ శ్రేణులు మంత్రి కాన్వాయ్‌ని అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, బీఆర్ఎస్ నిర్మల్ జిల్లా ఇన్‌చార్జ్ గంగాధర్ గౌడ్, బీఆర్ఎస్ నిర్మల్ జిల్లా అధ్యక్షులు, ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కొరిపెల్లి విజయలక్ష్మిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లా ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షులు నల్లా వెంకట్‌రాంరెడ్డి, జిల్లా గ్రంథాయల సంస్థల చైర్మెన్ ఎర్రవోతు రాజేందర్, నిర్మల్ మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, ఎఫ్ఎస్సీఎస్ చైర్మెన్ ధర్మాజీ రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మెన్లు చిలుక రమణ, ఆశ్రితరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ముడుసు సత్యనారాయణ, బీఆర్ఎస్ మండల కన్వీనర్ రాజేశ్వర్, బీఆర్ఎస్ నాయకులు అల్లోల గౌతంరెడ్డి, అల్లోల సురేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ చిన్న రామయ్య, ఎంపీపీ కోండ్ర రేఖా రమేష్, సర్పంచ్ అరుగుమీది రామయ్య, ఇతర గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఖానాపూర్ ప్రాజెక్టు నుండి మామడను మార్చొద్దు

- ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు సునారికారి రాజేష్



నవతెలంగాణ-ఖానాపూర్

ఐసీడీఎస్ ఖానాపూర్ ప్రాజెక్టు నుండి మామడ మండలాన్ని నిర్మల్ ప్రాజెక్టుకు మార్చే ఆలోచనను విరమించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు సునారికారి రాజేష్ అన్నారు. గురువారం ఖానాపూర్ పట్టణంలో అంగన్‌వాడీ టీచర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1992 లో ఐసీడీఎస్ ఖానాపూర్ ప్రాజెక్టు ఏర్పడిందని ఖానాపూర్ ప్రాజెక్టు కింద గత 20 సంవత్సరాలుగా మామడ మండలం కొనసాగుతుందని అన్నారు. మామడ మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నలుగురు అంగన్‌వాడీ టీచర్లు విధులకు ఎగనామం పెడుతూ విధులు సక్రమంగా నిర్వహించడం లేదని అన్నారు. నిర్మల్‌లో వ్యాపారం కోసం వారి స్వార్థం కోసం ఖానాపూర్ పరిధిలో ఉన్న మామడ కేంద్రాలను నిర్మల్ ప్రాజెక్టుకు మార్చాలని కుట్ర చేస్తున్నారని అన్నారు. ఖానాపూర్‌కు మామడకు దూరం 10 కిలోమీటర్ల మాత్రమేనని, మామడకు నిర్మల్ దూరబారం 20 కిలోమీటర్లు ఉంటుందన్నారు. ప్రతి నెలకు 2, 3 సార్లు ప్రాజెక్టు మీటింగ్ ఉండటం వల్ల రావడానికి పోవడానికి అన్నిరకాలుగా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు 59 ఉండగా కేవలం నలుగురు టీచర్లు రాజకీయ పలుకుబడితో నిర్మల్‌కు తరలించాలని ఆలోచన చేస్తున్నారని అన్నారు. ఈ ఆలోచనను వారు వెంటనే విరమించుకోవాలని అన్నారు. ఈ నలుగురు అంగన్‌వాడీ టీచర్లు విధులకు ఎగనామం పెడుతూ డుమ్మాలు కొట్టుతూ నిర్మల్‌లో వ్యాపారం కొనసాగిస్తున్న వారిని విధుల నుండి తొలగించాలని అన్నారు. మామడ మండలాన్ని ఎప్పటిలాగే ఖానాపూర్ ఐసీడీఎస్ పరిధిలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనియెడల భవిష్యత్‌లో దశల వారీగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి దుర్గం లింగన్న, అంగన్‌వాడీ టీచర్లు విజయ, సుజాత, కళావతి, సువర్ణ, సాయి ప్రియ, వనిత, లక్ష్మీ, రమాదేవి, వాణి, స్వప్న పాల్గొన్నారు.

ఉత్తమ గ్రామ పంచాయతీలకు అవార్డులు అందజేత



నవతెలంగాణ-సిరికొండ

నేషనల్ ఉత్తమ పంచాయతీ అవార్డుల్లో భాగంగా ఎంపికైన గ్రామ పంచాయతీలకు గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సురేష్, ఎంపీపీ అమృత్‌రావు చేతుల మీదుగా ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డులను సర్పంచ్‌లకు అందజేశారు. మొత్తం 9 శాఖల్లో అవార్డులు ఉండగా, ఈ అవార్డులను మండలంలో మొత్తం 19 గ్రామ పంచాయతీలు ఉండగా 14 ఎంపికయ్యాయని ఎంపీడీఓ సురేష్ తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల సర్పంచ్‌లను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ అతుల్ కుమార్, ఏపీఓ శేషారావ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నార్నూర్: నేషనల్ ఉత్తమ పంచాయతీ అవార్డుల్లో భాగంగా ఉత్తమ గ్రామపంచాయతీలుగా జిల్లా, మండల స్థాయిలో ఎంపికైన 13 గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు, కార్యదర్శులకు, గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కనక మోతుబాయి చేతుల మీదుగా ఎంపీడీఓ కావల రమేష్, ఎంపీఓ స్వప్న శీలా ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సన్మానించారు. జిల్లా స్థాయిలో గుంజాల, మలేంగి, మహాగావ్, గంగాపూర్, మండల స్థాయిలో నార్నూర్, తాడిహత్నూర్, బెతల్‌గూడ, జామడ, బలాన్‌పూర్, ఎంపల్లి, సుంగాపూర్, మాలేపూర్, మాన్యాపూర్ గ్రామపంచాయతీలుగా ఎంపికైనట్లు పేర్కొన్నారు. సర్పంచులు, కుమ్ర సావిత్రి, యశ్వంత్ రావ్, పూసం రూప, ఆత్రం పరమేశ్వర్, రాథోడ్ సావిందర్, ప్రేమ్‌సింగ్, ఉపసర్పంచ్ విష్ణు, కార్యదర్శులు శ్రీనివాస్, స్నేహ, శంకర్, రమేష్, దినేష్, కొల రాజశేఖర్, శ్రీనివాస్, రాధిక, అవినాష్, అనురాగ్, రాంసింగ్, రాజన్న, లవకుమార్ ఉన్నారు.

ఇంద్రవెల్లి: మండలంలోని 18 గ్రామపంచాయతీల్లో ఉత్తమ పంచాయతీ అవార్డు గ్రహీత సర్పంచ్‌లకు గురువారం నాడు స్థానిక ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లాలోనే ఉత్తమ పంచాయతీగా అవార్డు పొందిన ఏమాయికుంట సర్పంచ్ జాదవ్ లఖన్‌తో పాటు పంచాయతీ కార్యదర్శిని శాలువాతో ఘనంగా సన్మానించారు. దీంతో పాటు మండలంలో ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన 18 గ్రామపంచాయతీల సర్పంచ్‌లకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమములో ఎంపీఓ సంతోష్ అధికారులు ఉన్నారు.



ఇంద్రవెల్లిలో..

ప్రమాదకరంగా ఉన్న స్పీడ్ బ్రేకర్లను తొలగించాలి

నవతెలంగాణ-ఖానాపూర్

రోడ్డుపై ప్రమాదకరంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లను వెంటనే తొలగించాలని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బాణావత్ గోవింద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖానాపూర్ మండలంలోని సుర్జాపూర్ గ్రామంలో గల బుడగ జంగం కాలనీలో రోడ్డుపై వేసిన స్పీడ్ బ్రేకర్ల వల్ల గురువారం అటుగా మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న షేక్ నజీర్‌కు కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై వేసిన స్పీడ్ బ్రేకర్లను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.

ప్రారంభమైన సేవాలాల్ దీక్ష భక్తుల పాదయాత్ర



నవతెలంగాణ-నార్నూర్

సేవాలాల్ దీక్ష భక్తుల పాదయాత్ర గురువారం ప్రారంభమైంది. కొత్తపెల్లి దీక్ష భూమి నుండి ప్రారంభమైన పాదయాత్ర మహారాష్ట్రలోని పౌరదేవి వరకు కొనసాగుతుందని భక్తులు తెలిపారు. చేపట్టిన పాదయాత్రలో జెడ్పీ చైర్మెన్ జనార్దన్ రాథోడ్, దీక్ష భూమి గురువు ప్రేమ్‌సింగ్ మహారాజ్‌తో పాటు వేలాది మంది సేవాలాల్ దీక్ష భక్తులు పాల్గొన్నారు.

పరిశుభ్రంగా ఉంటూ సమన్వయంతో ముందుకు పోవాలి

నవతెలంగాణ-తాంసి

సర్పంచ్‌లు పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో ఉంటూ తమ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకొంటూ ముందుకు సాగి పోవాలని డీఎల్పీఓ ధర్మరాణి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీ దీన్‌దయళ్ ఉపాధ్యాయ పంచాయతీ ప్రోత్సాహలను సర్పంచ్, కార్యదర్శులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తొమ్మిది రకాల థీమ్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అందులో మంచి ప్రతిభ కనబరిచిన గ్రామ పంచాయతీలకు ప్రోత్సహలు అందించడం జరిగిందని అన్నారు. గ్రామంలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని, ఆరోగ్యం, క్లీన్ అండ్ గ్రీన్ సామాజిక భద్రత తో పాటు మరిన్ని థీమ్‌లను మరింతగా బలోపేతం చేసుకోవాలని అన్నారు. మరిన్ని ప్రోత్సహకాలు తీసుకునేలా పని చేయాలని అన్నారు. ఇండ్ల ట్యాక్స్‌లు వంద శాతం వసూలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జీ ఎంపీడీఓ రవీందర్, వైస్ ఎంపీపీ రేఖా, ఎంపీఓ సుదీర్‌రెడ్డి, సర్పంచ్‌లు కార్యదర్శులు ఉన్నారు.

ముమ్మరంగా కొనసాగుతున్న పోషణ పక్షోత్సవాలు

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం నాలుగో రోజు పోషణ పక్షోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా అంగన్‌వాడీ టీచర్‌లు గర్భిణీ బాలింతల అత్త మామలకు, కుటుంబ సభ్యులకు కిచెన్ గార్డెన్ ఏర్పాటు నిర్వహణ, చిరు ధాన్యాలు వాటి ప్రాముఖ్యతను వివరించారు. మహాగావ్ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ కల్పిస్తున్న అవగాహన తీరును పోషణ అభియాన్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్, దాబా, నార్నూర్, నాగల్‌కొండ అంగన్‌వాడీ కేంద్రంలో ఇన్‌ఛార్జి సీడీపీఓ ఉమా,సూపర్ వైజర్‌లు వందన, ఉమా పరిశీలించారు.

కేంద్ర బృందం ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-ఉట్నూర్



మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని కేంద్రం బృందం సభ్యులు డాక్టర్ రఘు పూజారీ, డాక్టర్ రహమాన్, డాక్టర్ ప్రశాంత్, స్టెల్లా, జిల్లా క్వాలిటి మేనేజర్ అమర్ నాథ్ గురువారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలతో పాటుగా పరిశుభ్రతపై ఆరా తీసి పరిశీలించారు. ప్రతి వార్డును సందర్శించారు. ఫార్మసీ, ఎక్స్ రే, ల్యాబ్, స్టోర్ రూం, ప్రసూతి గదులు, బ్లడ్ బ్యాంక్, డయాలసిస్, ఎస్ఎన్సీయూ, తదితర వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్పత్రిలో కాయకల్ప పథకం ద్వారా ప్రభుత్వ ఆస్పత్రి ఎంపికైందన్నారు. ఆస్పత్రిలో నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని అన్నారు. వారి వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జాదవ్ ఉపేందర్, డాక్టర్లు మహేందర్, సిబ్బంది ఉన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-సారంగాపూర్

కంటి వెలుగును శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బీరవెల్లిలో రెండో విడుత కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏండ్లపై బడిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. ప్రభుత్వం ఉచితంగా ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి, కండ్లఅద్దాలు, మందులను అందజేస్తుందని అన్నారు. గ్రామ ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సరోజ, మార్కెట్ కమిటీ చైర్మెన్ ఆశ్రిత శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ లయ కరుణసాగర్ రెడ్డి, కోప్షన్ సభ్యులు ఇస్మాయిల్, పంచాయతీ సెక్రటరీ మోహినొద్దిన్, వైద్య సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో ఆవు మృత్యువాత

నవతెలంగాణ-ముధోల్

మండలంలోని రాంటెక్ గ్రామానికి చెందిన మోహన్ అనే రైతుకు చెందిన ఆవు గురువారం విద్యుద్ఘాతానికి గురై ఆవు మృత్యువాత పడింది. స్థానికులు, బాదితుని కథనం ప్రకారం.. తన చేను సమీపంలో ఆవు మేసేందుకు వెళ్లి అక్కడె ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుద్ఘాతానికి ఆవు గురైంది. ఆవు విలువ సుమారు రూ.30వేల వరకు ఉంటుందని బాధిత రైతు పేర్కొన్నాడు.

ఆర్‌కే-7 గనిని సందర్శించిన ఏసీపీ

నవతెలంగాణ-నస్పూర్

జైపూర్ ఏసీపీ నరేందర్ కుటుంబ సభ్యులతో కలిసి గురువారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-7 గనిని సందర్శించారు. గనిలోని 2ఎస్15 డిస్టిక్‌ను పరిశీలించి కార్మికులు ఏ విధంగా బొగ్గుని వెలికి తీస్తారు మేనేజర్‌ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏసీపీ నరేందర్ మాట్లాడుతూ ప్రకృతి విరుద్ధంగా 200 నుండి 300 మీటర్ల లోతులోకి వెళ్లి పని చేస్తున్న కార్మికుల కష్టాన్ని తెలుసుకున్నానని వారి కష్టాన్ని మాటల్లో చెప్పలేమని కార్మికులు తీస్తున్న బొగ్గు వల్లనే ఈ దేశంలో వెలుగులు విరజిల్లుతున్నాయని అన్నారు. కుటుంబ సభ్యులతో ఈరోజు గనిని సందర్శించడం చాలా సంతోషంగా ఉందని పిల్లలు కూడా గని లోపల ఇలా కార్మికులు ఏ విధంగా పనులు నిర్వహిస్తారో తెలుసుకోవడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో గని మేనేజర్ సాయిప్రసాద్, శ్రీరాంపూర్ ఎస్సై మానస, గుర్తింపు సంఘం ఫిట్ కార్యదర్శి మేండే వెంకటి, రక్షణాధికారి రవిశంకర్, అండర్ మేనేజర్ వాసు దేవేందర్, ఇంజనీర్ తోట రమేష్ పాల్గొన్నారు.

బావిలో పడి మహిళ మృతి

నవతెలంగాణ-జైనూర్

బావిలో పడి ఓ మహిళ మృతిచెందిన సంఘటన మండలంలోని జంగాం గ్రామ పంచాయతీ పరిధిలోని కొలాంగూడ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై మధూకర్, మృతురాలి కుమారుడు కొడప ఆనంద్‌రావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జంగాం గ్రామ పంచాయతీ పరిధిలో గల కొలాంగూడ గ్రామానికి చెందిన కొడప పోశుబాయి(57) అనే గిరిజన మహిళ రాత్రి రోజూవారీగా అన్నం తిని సుమారు 9 గంటల ప్రాంతంలో బయటకు వెళ్లి వస్తానని వెళ్లింది. సుమారు గంటసేపైన తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆమె ఆచూకీ కోసం రాత్రి వెతకగా కనిపించలేదు. ఈ క్రమంలో ఇంటి దగ్గర గల బావిలో ఆమె మృతదేహం లభ్యమైంది. అనంతరం గ్రామస్తులతో కలిసి ఆమె మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీశారు. ఆమె మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని కుటుంబసభ్యులు తెలిపారు. కుమారుడు కొడప ఆనంద్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

మంత్రి ఐకేరెడ్డి నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పేపర్ లీకేజీ సర్వసాధారణం అని బాధ్యత లేని మాటలు మాట్లాడిన రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలని నేషనలిస్ట్ స్టూడెంట్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పురేళ్ల నితీష్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వల్ల తెలంగాణ వ్యాప్తంగా 30 లక్షల మంది నిరుద్యోగులు, కోటి మంది ప్రజల సమస్యను రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి బాధ్యత లేకుండా లీకేజీ అంశం చాలా చిన్నదని మాట్లాడడం నిరుద్యోగులను అవమానించడమేనని అన్నారు. మంత్రి మతిలేని మాటలు మానుకోవాలని, రూ.లక్షలు కోచింగ్ సెంటర్లకు ఖర్చు పెట్టి, ఏళ్ల తరబడి ఉద్యోగాలకు చదువుతూ సిద్ధంగా ఉండి కోట్లాడితె అరకొర ఉద్యోగ నియామక నోటిఫికేషన్ జారీ చేస్తే, తీరా ఇప్పుడు వాటిని కూడా లీక్ చేసి పైసల కోసం తెలంగాణలో పరీక్ష పేపర్‌లు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగులను అవమానిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. తక్షణమే బేషరతుగా విద్యార్థి, నిరద్యోగులకి మంత్రి క్షమాపణ చెప్పాలని, లేని యెడల నిరుద్యోగుల ఆగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే ఏ లీకేజీలు లేకుండా పరీక్షలు నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు.

ఆడపిల్లల తల్లిదండ్రులకు పూర్తిస్థాయి భరోసా

- కల్యాణ లక్ష్మీ,షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పేదింటి ఆడపిల్లల పెళ్లికి పూర్తిస్థాయి భరోసా కల్పిస్తూ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాన్ని ప్రవేశపెట్టి కేసీఆర్ ఆ కుటుంబాలకు పెద్దదిక్కుగా నిలిచారని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలో 117 మంది కల్యాణలక్ష్మి, షాదిముబారక్ పథకం లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడగకుండానే ప్రజల బాధలు అర్థం చేసుకుని కేసీఆర్ మహిళలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి వారి కష్టాలు తొలగిస్తున్నాడని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, మార్కెట్ కమిటీ చైర్మన్ గదవేణి మల్లేష్, సింగల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, తహసీల్దార్ రామ్మోహనరావు, ఎంపీడీఓ శశికల పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీ సర్పంచ్‌లకు సన్మానం

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

దీన్‌దయాల్ ఉపాధ్యాయ పంచాయతీ శతత వికాస్ పురస్కారాల సందర్భంగా జాతీయ పంచాయతీ అవార్డుల కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికైన సర్పంచ్‌లను, సిబ్బందిని గురువారం సన్మానించారు. పంచాయతీ అవార్డులలో చెడ్వాయి మొదటిస్థానం, కొండపెల్లి రెండో స్థానం, ఎలుకపెల్లి మూడో స్థానంలో ఉండగా సర్పంచ్‌లు చౌదరి సుజాత, గణపురం కావ్యను జడ్పీటీసీ సముద్రాల సరిత, ఎంపీడీఓ గంగాసింగ్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. ప్రతి గ్రామ పంచాయతీలో 9 స్కీంలలో ప్రతిభ కనబరచడంతో గ్రామ పంచాయతీలకు అవార్డు వచ్చినట్టు ఆయన తెలిపారు. పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ, ఆశా సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పారిశెట్టి ఈశ్వరి, దుర్గం రాజన్న, మధునయ్య, కళావతి, ఎంపీటీసీ దూగుంట రాజన్న, మండల కోఆప్షన్ సభ్యుడు సాజిత్, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు సముద్రాల రాజన్న, చౌదరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట

నవతెలంగాణ-జైపూర్

మండలంలోని నర్వ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం ఉదయం అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామస్థుల కోరిక మేరకు దాతల సహకారంతో స్థానిక సర్పంచ్ దూట మైతిలి రాజ్‌కుమార్ ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేశారు. సువిశాలంగా నిర్మించిన నూతన ఆలయంలో హనుమాన్ పీఠాధిపతులు దుర్గాప్రసాద్ చేతుల మీదుగా అభయాంజనేయ స్వామి విగ్రహంతో పాటు శివపంచాయుత, నవగ్రహ సంతాన నాగలక్ష్మి, ధ్వజస్తంభ ప్రతిష్టాపన జరుగుతుందని సర్పంచ్ దూట మైతిలి రాజ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గత మూడు రోజులుగా నూతన ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నట్లు తెలిపారు. విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని ఆంజనేయస్వామి హోమం, ధ్వజస్తంభారాధనం, ద్వార తోరణ, మహాపూర్ణాహుతి, క్షరాధివాసం విగ్రహ ప్రాణ ప్రతిష్ట, ప్రథమ దర్శనం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ శ్రేణుల ముందస్తు అరెస్టు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

గ్రూప్ లోన్ రద్దుకై తెలంగాణ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ఇచ్చిన నోటీసులపై గురువారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు చేపట్టనున్న ధర్నాకు వెళ్లే ఆ పార్టీ మండల నాయకులను ఎస్సై విజయ్ ముందస్తుగా అరెస్టు చేశారు. ముందస్తు అరెస్టయిన వారిలో పోతపెల్లి సర్పంచ్ చంద్రమౌళి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హతహాబేగ్, సోషల్ మీడియా కన్వీనర్ భాస్కర్, నాయకులు బండు, బాపూజీ ఉన్నారు.



భగత్‌సింగ్ స్ఫూర్తితో

మతోన్మాదంపై పోరాడాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్
- ఘనంగా భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవు వర్ధంతి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

భగత్ సింగ్ స్ఫూర్తితో మతోన్మాదంపై పోరాటానికి సిద్ధం కావాలని ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ అన్నారు. గురువారం జిల్లా కార్యాలయంలో భగత్ సింగ్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ కార్మిక వివాదాల చట్ట బిల్లుకు వ్యతిరేకంగా, నిరసనలో భాగంగా పార్లమెంటుపై బాంబువేసి ఎవరికి ప్రాణహాని జరగకుండా స్వయంగా లొంగిపోయారన్నారు. పెట్టుబడిదారి విధానం నశించాలని, సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా, కుల మతోన్మాద రాజకీయాలను వ్యతిరేకిస్తూ, ముందుకు సాగాలని అన్నారు. భగత్ సింగ్ ఆశయ సాధనలో కార్మిక వర్గం అడుగువేయాలని అదే స్ఫూర్తితో పోరాటాలు నిర్వహించడమే భగత్ సింగ్‌కు మనము అర్పించే ఘన నివాళ్లు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుద్ధు, సుదర్శన్, శంకర్, రమేష్, బాలేష్, ఆనంద్, కీర్తిరమ, కల్పన, ఫైమా పాల్గొన్నారు.

బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో

భారతదేశాన్ని బానిస సంకెళ్ల నుండి విముక్తి చేయడానికి బ్రిటిషర్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ లాంటి పోరాట యోధులు ఆదర్శప్రాయులని బీసీ విద్యార్థి సంఘం నాయకుడు ఆవిడపు ప్రణయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ల వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గడ్డల ప్రణయ్, ఆవిడపు తరుణ్, సాయి చరణ్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ కార్యాలయంలో భగత్ సింగ్ 92వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మాట్లాడుతూ భగత్ సింగ్ ఆశయాలను కొనసాగించాలన్నారు. దేశ స్వతంత్రం కోసం 23 సంవత్సరాల వయసులోని భగత్ సింగ్ ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేశారని చివరకు ఉరికంబాన్ని సైతం ఎక్కారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్రి సత్యనారాయణ, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పిడుగు శంకర్, బి.సుధాకర్, దుర్గం రవీందర్, జిల్లా కార్యదర్శి మల్లేష్, నాయకులు జి.మోహన్‌బాబు, సత్తర్ బేగ్‌లు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఆశయాలను కొనసాగిస్తామని కొమురం భీం అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సతీష్ అన్నారు. గురువారం మండలంలోని మురళీగూడ గ్రామంలో యువజన సంఘం ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోండ్వాన ఆదివాసీ జిల్లా అధ్యక్షుడు తలండి మధూకర్ మాట్లాడుతూ 23 ఏండ్ల వయసులో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ బ్రిటీష వారితో వీరోచితంగా పోరాడి ప్రాణాలు అర్పించారన్నారు. కార్యక్రమంలో యువజన సంఘం ప్రధాన కార్యదర్శి తలండి మహేష్, ఉపాధ్యక్షుడు కామెర తిరుపతి, తలండి సతీష్, కార్యదర్శి దుర్గం రమేష్, పాఠశాల కమిటీ చైర్మన్‌లు వెంకటేశ్, సుధాకర్, యువజన సంఘం సభ్యులు దేవాజీ, శ్రీనివాస్, విక్రమ్, ప్రకాష్, శంకర్ పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్ : దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన భగత్ సింగ్ ఆశయాలతో యువత ముందుకెళ్లాలని సీపీఐ పట్టణ కార్యదర్శ మిట్టపెల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం భగత్‌సింగ్ 92వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఇప్పకాయాల లింగయ్య, సీపీఐ జిల్లా సమితి సభ్యులు మిట్టపెల్లి పౌలు, నక్క వెంకటస్వామి, వనం సత్యనారాయణ, కాదండీసాంబయ్య, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

మంచిర్యాల : స్వాతంత్ర్య ఉద్యమ ఆకాంక్షలకు, జాతీయ సమైక్యతకు ప్రతిబింబంగా నిలిచిన షహీద్ భగత్ సింగ్ జీవితం నేటి యువతకు ఆదర్శంగా నిలవాలని సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం పిలుపునిచ్చారు. గురువారం ఎంవీఎన్ కళాశాలలో స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన "షహీద్ భగత్ సింగ్ బలిదానోత్సవ సభ" లో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. భరతమాత దాస్య శృంఖలాలను తెంచివేయడం కోసం ఇరవైమూడేళ్ల చిరుప్రాయంలోనే ఉరికంబం ఎక్కిన షహీద్ భగత్ సింగ్ వారసత్వాన్ని నేటి యువత కొనసాగించాలని వారు పిలుపునిచ్చారు. షహీద్ భగత్ సింగ్, ఆయన సహచరులైన రాజ్ గురు సుఖదేవ్, ఉద్దం సింగ్, అష్ఫకుల్లా ఖాన్‌లు కులమతాలకతీతంగా పోరాటం చేసి జాతి సమైక్యతను నిలబెట్టారని ఆయన తెలిపారు.

కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ తిరుపతి పాల్గొన్నారు.

ఎన్నికలలోపు ఐటి మాఫీ అమలు చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో గుర్తింపు ఎన్నికలు అయ్యేలోపు కార్మికుల అలవెన్స్‌లపై ఐటి మాఫీ అమలు చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం శ్రీరాంపూర్‌లోని ఎస్ఆర్పీ-3 గనిలో మిడివెల్లి శంకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. గుర్తింపు కాలపరిమితి ముగిసినప్పటికీ ఇంకా గుర్తింపు సంఘం అంటూ ఒకే యూనియన్‌ను గుర్తించడం సరికాదని, అన్ని యూనియన్లతో మైన్స్ సేఫ్టీ కమిటీ సమావేశాలు ఎన్నికలు అయ్యేంతవరకు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు కార్మికుల అనుకూలమైన అనేక పెండింగ్ సమస్యలు పరిష్కారానికి నోచుకోక మళ్లీ అవే డిమాండ్లను పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో ప్రస్తావిస్తున్నారన్నారు. ఓడిన సంఘాలను మాట్లాడనీయకుండా ఉండెందుకు యాజమాన్యంతో కలిసి కొన్ని యూనియన్లు కోడ్ ఆఫ్ డిసిప్లేన్ మార్చడానికి ఒప్పుకోవడం లేదని విమర్శించారు. ఎన్నికల ప్రక్రియ మొదలుకాకముందే పెండింగ్‌లో ఉన్న ఆర్ఎల్సీ వద్ద అగ్రిమెంట్ చేసిన డిమాండ్లపై సర్క్యులర్ ఇవ్వాలని, ఇప్పటికే ఇంకమ్ టాక్స్‌తో సంవత్సరంలో మూడు నాలుగు నెలల జీతం నష్టపోతున్న కార్మికులకు 2011లో చేసిన అలవెన్స్‌పై ఐటి మాఫీ కోలిండియా ఒప్పందాన్ని అధికారులు అమలు చేసుకున్నట్లు కార్మికులకు కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. హెల్మెట్, రేడియం జాకెట్లు సేఫ్టీ గా పరిగణించే అధికారులు సేఫ్టీ కమిటీ సమావేశాల్లో ఎన్నిసార్లు గనుల్లోకి దిగి పర్యవేక్షణ చేశారో చెప్పాలని, నాసిరకం పనిముట్లు, కార్మికుల ఆరోగ్యానికి సైతం ఎల్1 టెండర్ల (తక్కువ ఖరీదుకు దొరికే మందులు) ద్వారా వచ్చే మందులను ఎందుకు ఇస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి మెండే శ్రీనివాస్, బ్రాంచ్ కార్యదర్శి గోదారి భాగ్యరాజు, ఉపాధ్యక్షులు గుల్ల బాలాజీ, ఆర్గనైజర్ కస్తూరి చంద్రశేఖర్, డివిజన్ నాయకులు వెంగళ శ్రీనివాస్, బానేష్ ,అజయ్, గౌస్ గంగాధర చారి పాల్గొన్నారు.

కబ్జా భూమిని స్వాధీనం చేసుకుంటేనే ఐటీఐ స్థలాన్ని ఖాళీ చేస్తాం

- తహసీల్దార్‌తో వాగ్వివాదానికి దిగిన గ్రామస్తులు



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కిస్టాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నబర్ , 138,139, లో గల భూమి, ఇదే గ్రామానికి చెందిన ఇద్దరు అధికార పార్టీ నాయకులు కబ్జా చేసుకున్నారని ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకునే అంతవరకు ఐటీఐ కళాశాల స్థలాన్ని ఖాళీ చేసే ప్రసక్తే లేదని కిష్టాపూర్ గ్రామస్తులు గురువారం ఆందోళనకు దిగారు. గ్రామంలోని ఇల్లు భూమిలేని నిరుపేద 50 కుటుంబాలు ప్రభుత్వ ఐటీఐ కళాశాల భవనానికి కేటాయించిన స్థలంలో చీరలతో గుడారాలు వేసుకున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ కిషన్ హుటాహుటిన రెవెన్యూ అధికారులతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఇది ప్రభుత్వ స్థలమని ఐటీఐ కళాశాలకు కేటాయించిన స్థలం కాబట్టి వెంటనే గుడారాలు తీసేసి ఖాళీ చేయాలని గ్రామస్తులను కోరగా, వారు తహసీల్దార్‌తో వాగ్వేదానికి దిగారు. ప్రభుత్వ భూమిని ఇద్దరు నాయకులు కబ్జా చేస్తే, మీకు కనబడటం లేదా పేదవారిమైన మేము ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుంటే మమ్ములను కాళీ చేయమనడం ఎంతవరకు సమంజసం అని తహసీల్దార్‌తో వాగ్వివాదానికి దిగారు. దీంతో తహసీల్దార్ 10 రోజుల సమయంలో అక్రమంగా పట్టా అయినటువంటి భూమిని స్వాధీనం చేసుకుంటాం మీరు వెంటనే భూమిని కాలి చేసి వెళ్లిపోవాలని వారికి సూచించారు.

న్యాయపరంగా పోరాటం చేద్దాం

తహసీల్దార్‌కు గ్రామస్తులకు మాటల యుద్ధం నడుస్తున్న సమయంలో ఖానాపూర్ నియోజకవర్గ బీజేపీ నాయకుడు హరినాయక్ సంఘటన స్థలానికి చేరుకొని గ్రామస్తులకు నచ్చజెప్పారు. ఎలాంటి రాజకీయాలకు పోకుండా అధికార పార్టీ నాయకులు చేసుకున్న పట్టాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. అలాగే పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చేవరకు మా పోరాటం ఆపమన్నారు. సంఘటనలో ఆర్ఐ భానుచందర్ రెవెన్యూ అధికారులు సుధాకర్ స్థానిక అదనపు ఎస్సై తానాజీ నాయక్, పోలీస్ అధికారులు గ్రామస్తులు సత్యం, వాసాల నరేష్, గట్టు మహేష్, మాజీ సర్పంచ్ శ్రీధర్, రమేష్ ఉన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-భీమారం

ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలని గురువారం మండల ఏపీఎం త్రియంభకేశ్వర్‌కు వీఓఏలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఓఏల సంఘం మండల అధ్యక్షుడు జుమ్మిడి సుధాకర్ మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికై ప్రతీ నిత్యం వారి అభివృద్ధికి తమ జీవితాలను అర్పిస్తున్నామని, అలాంటి వీఓఏలు వెట్టి చాకిరికి ఎదుర్కొంటు కనీస జీత భత్యాలు పొందడంలేదని ఆవేధన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రూపకల్పన చేసిన ప్రతీ విశయాన్ని ఎప్పటికప్పుడు స్వయం సహాయక సంఘాల ద్వారా సమాజానికి చేరవేస్తు ప్రభుత్వానికి ప్రజలకు వారధిలా ఉంటున్నామన్నారు. అలాంటి తమకు కేవలం రూ.3900 వేతనంతో సరిపెట్టడం బాధాకరమని అన్నారు. ఎన్నో సమస్యలను ఎదుర్కొంటు ప్రభుత్వ ఆధేశాలను అమలు చేస్తున్న తమను గుర్తించక పోవడం ఆవేధనకు గురి చేస్తోందని, తమ సమస్యలను డిమాండ్ల రూపంలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తూ ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 02 వరకు నిరవాధిక సమ్మె చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి వీఓఏ కుటుంబానికి రూ.10 లక్షల సాధారణ భీమా, ఆరోగ్య భీమా సౌకర్యం కల్పించాలి, సెర్ప్ నుండి ఐడీ కార్డులను మంజూరు చేయాలని, గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండ ప్రతీ నెల వేతనాలు వ్యక్తిగత ఖాతాలో జమ చేయాలి, అర్హులైన విఓఏలను సీసీలుగా గుర్తించి పదోన్నతి కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో సీఏలు మమత, అరుణ, భాగ్యలక్ష్మి బి.లక్ష్మి, విజయ, దేవిక, పద్మ, వనజ, వనిత, దుర్గరాణి, రాజేశ్వరి, స్రవంతి, శ్రీనివాస్, సమ్మయ్య పాల్గొన్నారు.

వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు చర్యలు

నవతెలంగాణ-జన్నారం



కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని తాళ్లపేట, జన్నారం, ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలో అడవి జంతువుల దాహార్తి తీర్చడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎఫ్‌డీఓ మాధవరావు తెలిపారు. రాబోవు వేసవి కాలంలో జంతువులకు నీటి సమస్య తలెత్తకుండా ఎక్కడికక్కడ నీటి కుంటలను, సాసర్వెల్లను, బోరువెల్‌లను నిర్మించామన్నారు. బైసన్ కుంట, గనిశెట్టి కుంట, నీళ్ గాయికుంటల్లో అడవి జంతువులు నీరు తాగడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. జన్నారం అటవీ డివిజన్ పరిధిలో మొత్తం 100 సాసర్వేలు, 190 నీటి కుంటలు, 25 ర్యాంపు వెళ్ళు, 20 సోలార్ పంపులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీటి నిర్వహణ కోసం బేస్ క్యాంప్ సిబ్బంది, ఎఫ్‌బీఓలు ఎప్పటికప్పుడు పనులలో నిమగ్నం అవుతున్నారన్నారు. కడెం ప్రాజెక్టు నుంచి కాలువల ద్వారా నీటిని అడవిలోకి పంపించి కుంటలను నింపుతున్నామన్నారు. మిషన్ భగీరథ ద్వారా కూడా కొంత నీటిని వాడుకొని జంతువుల దాహార్తిని తీర్చడానికి ఉపయోగించుకుంటున్నామన్నారు. అడవిలో భూగర్భ జలాలు పెరగడానికి, జాతీయ ఉపాధి హామీ పథకంలో గుంతలను తవ్వించి నీటిని నిలువ చేయడానికి పనులు జరుగుతున్నాయని తెలిపారు. అడవిలో నివసించే జంతువులకు, జీవరాసులకు నీటి సమస్య తలెత్తకుండా ఈ వేసవిలో అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు.

వెదురు ఆవిష్కరణలను ప్రోత్సహిస్తాం

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో వెదురుతో తయారు చేసిన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తామని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి వెదురుతో తయారు చేసిన ఆఫీస్ ఫైల్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వెదురుతో తయారుచేసిన ఉత్పత్తులను ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని తిర్యాణి మండలం మంగి గ్రామపంచాయతీ కొలాంగూడ గ్రామస్తులు తయారుచేసిన ఆఫీస్ ఫైల్స్‌ను ఆవిష్కరించడం జరిగిందని తెలిపారు. గ్రామస్తులు తాము వెదురుతో తయారు చేసిన 15 రకాల ఉత్పత్తులకు మార్కెటింగ్‌తో పాటు రుణ సదుపాయం కల్పించాలని కోరగా జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. అంతకుముందు జిల్లా ఎస్పీ సురేష్ కుమార్‌ను కలిసి సహాయం కోరగా మార్కెటింగ్‌కు అవసరమైన సౌకర్యాలు కల్పించేలా ఏర్పాటు చేస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంగి, ముల్కల మంద సర్పంచులు రాయి సిడాం సోంబాయి శంకర్, ఉయిక అర్జుబాయి గోవింద్, శిక్షకులు బురం చంద్రయ్య, బురం శ్రీనివాస్ పాల్గొన్నారు.

చింతలపల్లెలో మన ఊరు-మన బడి పాఠశాల ప్రారంభం



నవతెలంగాణ-జన్నారం

మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా మండలంలోని చింతలపల్లి ప్రాథమిక పాఠశాలను ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీర రేఖాశ్యాం నాయక్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఎస్.విజయకుమార్ మాట్లాడుతూ, మన ఊరు-మనబడి కార్యక్రమంలో భాగంగా పూర్తయిన పాఠశాలలను మిగిలి ఉన్న పనులను ఏప్రిల్ నెల ఆఖరు వరకు అన్ని పాఠశాలలో పనులు పూర్తి చేయించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, వారికి కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు. విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలపై గ్రామస్తులకు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కొండు జనార్ధన్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కట్టరాజమౌళి, ఎంపీపీ మాదాడి సరోజన, వైస్ ఎంపీపీ సుతార్ వినయ్ కుమార్, ఆర్ఎస్ఎస్ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి, కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్, స్థానిక సర్పంచ్ వజ్జల భాగ్య లక్ష్మి, ఉపాధ్యాయులు రాములు నాయక్, సరళ, జిల్లా నాయకులు భరత్ కుమార్, మౌలానా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్ పాల్గొన్నారు.

పవర్‌ప్లాంట్ ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ

నవతెలంగాణ-కోటపల్లి

చెన్నూర్ మండలంలోని శివలింగాపూర్ గ్రామ సమీపంలో మూతపడ్డ చెన్నూర్-2 ఇంక్లైన్ గని అవరణలో ఏర్పాటు చేస్తున్న సోలార్ పవర్ ప్లాంట్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణ పనులను గురువారం శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తితో పాటు సౌర విద్యుత్ ఉత్పత్తిలో భాగంగా చెన్నూర్‌లోని 2 ఇంక్లైన్ గని అవరనాలో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి స్థలాన్ని కేటాయించి చుట్టూ ప్రహరీ గోడను నిర్మిస్తున్నట్లు తెలిపారు. 11 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయడానికి అవసరమైన పనులను యుద్ధ ప్రాతిపదికన చేయాలని సంబధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీజీఎం సివిల్ శివ, ఏరియా వర్క్ షాప్ ఇంజనీర్ రాకేష్ పాల్గొన్నారు.



అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శుక్రవారం 24 మార్చి 2023

ఫొటో, వీడియోగ్రాఫర్లు కుటుంబ భరోసా పథకంలో చేరాలి
నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఫొటో, వీడియోగ్రాఫర్‌ల కోసం తీసుకొచ్చిన కుటుంబ భరోసా పథకంలో ప్రతి ఒక్కరు చేరాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్ తెలిపారు. జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనను జిల్లాలోని ఫొటో, వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న డిజిటల్ యుగంలో ఫోటోగ్రాఫర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన కుటుంబ భరోసా పథకంలో ప్రతి ఒక్కరు చేరాలని తెలిపారు. ఇదే సందర్భంలో రానున్న రోజుల్లో జిల్లా కేంద్రంలో సెమినార్ ఏర్పాటు చేయాలని కోరగా, దానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తానని జిల్లా సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు సలీం, రాజు, సతీష్, మనోహర్ పాల్గొన్నారు.

హస్తకళ ఓజా గిరిజన మహిళకు అవార్డు
నవతెలంగాణ-జైనూర్



రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో గిరిజన మహిళకు శ్రీనిధి లోన్ ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందిన బెస్ట్ కళాకారులుగా ఎన్నుకొని అవార్డు అందజేసినట్టు జైనూర్ మహిళా సమాఖ్య ఏపీఓ సుజాత అన్నారు. గురువారం ఆమె తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని రాష్ట్రవ్యాప్తంగా హైటీజ్ అవార్డు పేరుతో నూతనంగా శ్రీనిధి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందిన ఇద్దరికి అవకాశం లభించిందన్నారు. అందులో మండలంలోని ఉషేగావ్ గ్రామానికి చెందిన ఓజా మహిళా సంతోషిని ఎన్నుకున్నట్టు తెలిపారు. అందులో భాగంగా గురువారం రాష్ట్ర రాజధానిలోని నోటెల్ హోటల్ హైటెకొసిటీలో ఈ అవార్డు అందుకున్నారన్నారు. ఆర్థికంగా అభివృద్ధి చెందిన మహిళలకు బెస్ట్ కళాకారులుగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి
నవతెలంగాణ-జైపూర్

చాలీ చాలని వేతనాలతో పని చేస్తున్న తమ పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని, పనికి తగిన వేతనం చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ఐకేపీ వీఓఏలు డిమాండ్ చేశారు. గురువారం వీఓఏలు డీఆర్డీఓ శేషాద్రినికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కుంటాల కుమార్ మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా ఐకేపీలో పని చేస్తున్న తమకు రూ.3900 వేతనంతో సరిపుచ్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సంఘాల అభివృద్ధి, మహిళల ఆర్థిక ఎదుగుదలకు ఎంతగానో కృషి చేస్తున్నామన్నారు. బ్యాంక్, ఎస్ఎస్ రుణాలు, ఇతరాత్ర రుణాలు ఇప్పించడం వంద శాతం రికవరీ చూపించడంలో కీలక పాత్ర పోషిస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పథకాల అమలులో కీలకంగా వ్యవహరిస్తున్న తమ పట్ల ప్రభుత్వ సానుకూలంగా స్పందించాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, ప్రమాద సాధారణ బీమా రూ.20 లక్షలు ఇవ్వాలని, అర్హత కల్గిన వీఓఏలకు సీసీలుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సుందిళ్ల లింగయ్య, మండల కార్యదర్శి మాధవరెడ్డి పలువురు వీఓఏలు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ
నవతెలంగాణ - రెబ్బెన

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎవరు అడుగకుండానే ప్రజల బాధలు అర్థం చేసుకున్న సీఎం కేసీఆర్ మహిళలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, వైస్ ఎంపీపీ గజ్జెల సత్యనారాయణ, తహసీల్దార్ మల్లిఖార్జున్, ప్యాక్స్ చైర్మన్ సంజీవ్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సంతల వేలం పూర్తి
నవతెలంగాణ - కౌటాల

మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే పశువుల, కూరగాయల సంతల వేలం పంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ ఒజ్జెల మౌనీష్, ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పశువుల సంతను మెర్పెల్లి అర్జున్ రూ.8.40 లక్షలకు దక్కించుకున్నారు. వారసంత కొడిపె పెంటు రూ.5 లక్షలకు దక్కించుకున్నారు. 2024 మార్చి 30 వరకు సంతల అద్దె రుసుమును వసూలు చేసుకొనే వెసులుబాటు కల్పించినట్టు సర్పంచ్ మౌనీష్ తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పసునూరి తిరుపతి, కార్యదర్శి సాయికృష్ణ, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

గిరి వికాస్ పనులు ప్రారంభం
నవతెలంగాణ-కోటపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గిరి వికాస్ పనులను చెన్నూర్ మండలంలోని బుద్దారం గ్రామంలో గురువారం ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ మోతే తిరుపతి ప్రారంభించారు. ముగ్గురు రైతులకు ఒక్కొక్కరికి రూ.5లక్షలతో బోర్ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన గొప్ప పథకం గిరి వికాస్ అని అన్నారు. గిరిజన రైతులు వారి సొంత భూమి ఉంటే బోర్ వేసుకునే విధంగా ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెన్నపురెడ్డి బాపురెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెల దామోదర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

దేవత విగ్రహాల పున:ప్రతిష్టకు చెక్కు అందజేత
నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని ఎల్లారం గ్రామంలో రోడ్డు విస్తరణలో గ్రామ దేవతల విగ్రహాలు పోగా పున:ప్రతిష్టకు జెడ్పి చైర్‌పర్సన్ కోవ లక్ష్మి రూ.30వేలు సదరు కాంట్రాక్టర్ నుండి గ్రామస్తులకు ఇప్పించారు. చెక్కును గురువారం గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామదేవతల పున:ప్రతిష్ట కోసం కృషి చేసిన జడ్పీ చైర్‌పర్సన్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘ జిల్లా అధ్యక్షుడు రూపునర్ రమేష్, సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, మోతుగూడ సర్పంచ్ వినోద్, బూరుగూడ సర్పంచ్ గోపాల్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు లోబడే లవ్‌కుమార్, బీసీ సంఘం మండల అధ్యక్షుడు సిరికొండ సాయికృష్ణ, బీసీ సంక్షేమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం
నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి పునరుద్ఘాటించారు. జిల్లా కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం తరపున దీర్ఘకాలిక రుణముగా మండలంలోని సత్రవేణి రాజన్నకు ట్రాక్టర్ రుణం మంజూరు చేయగా ఎమ్మెల్యే ఆత్రంసక్కుతో కలిసి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్నారు. రైతుబంధు, రైతుబీమా లాంటి పథకాలతో పాటు అవసరమైన రుణాలు మంజూరు చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం ఇస్తున్న రుణాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి సొసైటీ అధ్యక్షుడు అలిబిన్ అహ్మద్ అధ్యక్షత వహించగా కార్యక్రమంలో జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్, తిర్యానీ ఎంపీపీ శ్రీదేవి, సొసైటీ వైస్ చైర్మన్ ప్రహ్లాద్, డైరెక్టర్లు విజయలక్ష్మి, మధుకర్, దేవన్న, ఆశన్న, శంకర్, ఎడీసీసీ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, సీఈఓ వెంకటరమణ పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నియంత్రణపై విద్యార్థులకు అవగాహన
నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

క్షయ, ఎయిడ్స్ వ్యాధి నియంత్రణపై విద్యార్థులకు గురువారం ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధి నియంత్రణ పద్ధతులను వివరించారు. క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నగేష్ బాబు, వైద్య సిబ్బంది రామచందర్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం
నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని పొచ్చర గ్రామంలో సిసి రోడ్డు పనులకు గురువారం ఉప సర్పంచ్ రమేష్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిసి రోడ్డు మంజూరు చేసిన ఎమ్మెల్యే జోగు రామన్నకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ గంగాధర్. గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న మోడీ ప్రభుత్వం

- రాష్ట్రాలపై కక్ష పూరిత రాజకీయాలు చేస్తోంది
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య
- నిర్మల్ జిల్లాలో కొనసాగిన జన చైతన్యయాత్ర



నవతెలంగాణ- నిర్మల్

కేంద్రంలో మోడీ ప్రభుత్వం ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభించడం, కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ దేశ సంపదను దారాదత్తం చేస్తోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య అన్నారు. బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎం) చేపట్టిన జన చైతన్య యాత్ర గురువారం సాయంత్రం నిర్మల్ జిల్లా కేంద్రానికి చేరుకుంది. మండలంలోని డ్యాంగాపూర్ నుండి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సభ ప్రాంగణం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యాత్రకు నేతృత్వం వహిస్తున్న వీరయ్య సభను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజల్లో కాంగ్రెస్‌పై ఉన్న వ్యతిరేకతతోనే బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. మోడీ అమిత్‌షాలు అధికారంలో వచ్చిన తర్వాత దేశానికి ఒరిగిందేమీ లేదన్నారు. ఎన్నడు లేని విధంగా నిత్యావసర సరకుల ధరలు పెరగాయన్నారు. ఒకవైపు అంతర్జాతీయంగా పెట్రోలింగ్ ముడి సరుకుల ధరలు సగానికి సగం తగ్గితే, పెట్రోల్ డీజిల్ ధరలను మోడీ ప్రభుత్వం మాత్రం పెంచిందని తెలిపారు. పెట్రోల్ ముడి సరుకు ధరలు తగ్గడంతో ప్రస్తుతం లీటరు రూ.35 ఉండాల్సింది, రూ.110కి ప్రభుత్వం పెంచింది అన్నారు. ధరలను అమాంతం పెంచుతూ పేద ప్రజల నడ్డి విరుస్తూ, మరోవైపు ఆదానీ, అంబానీకి దేశ సంపదను దోచిపెడుతుందన్నారు. గుజరాత్ సీఎంగా మోడీ ఉన్న సమయంలో ఆదాని ఆస్తులు రూ. 17వేల కోట్లు ఉంటే పీఎం పదవి అనంతరం రూ. 10 లక్షల 30 వేల కోట్లకు చేరిందన్నారు. ఇంత తక్కువ సమయంలో ఆస్తులు పెరగడం ఏంటని ప్రశ్నించారు. అంతర్జాతీయ సంస్థ ఈ వాస్తవాన్ని బయటకు తీసిందన్నారు. ప్రశ్నించిన వారిపై ఈడి, ఐటి దాడులు నిర్వహిస్తున్నారని విమర్శించారు. దేశంలో కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఢిల్లీ రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు ఉండటంతో కొంత అభివృద్ధి జరుగుతుందన్నారు. మోడీ ప్రభుత్వం ఈ రాష్ట్రాలపై కక్ష పూరిత రాజకీయాలు చేస్తుందన్నారు. రైతులకు రైతుబంధు, ఎరువులు ఇతర సబ్సిడీలు ఉచిత విద్యుత్తు ఇస్తుంటే కేంద్రం ఆంక్షలు విధిస్తోందన్నారు. రైతు చట్టాలు తీసుకురావడానికి కుట్రలు చేసిందని ఆ చట్టాలు చట్టబద్ధత అయితే రైతు వ్యవస్థ ప్రమాదంలో పడే అవకాశముందన్నారు. మోడీ పాలనలో నిరుద్యోగ సమస్య ఎన్నడు లేనివిధంగా పెరిగిందన్నారు. ఉపాధి హామీకి ఈ బడ్జెట్లో 30 శాతం కోత విధించిందన్నారు. ఈ మతోన్మాద బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ఉద్యమించాలన్నారు.ఆ పార్టీ రాష్ట్రంలో సైతం నీచ రాజకీయాలు చేస్తుందన్నారు. బండి సంజయ్ పాదయాత్ర పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారన్నారు. బాసర, వేములవాడ, యాదాద్రి లాంటి పురాతనమైన దేవస్థానంలో పాదయాత్రను ప్రారంభించకుండా హైదరాబాదులోని భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రారంభించడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. నిర్మల్ పోరాట గడ్డ అని రాంజీగోండ్ స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

యాత్ర అడ్డుకునేందుకు పోలీసుల యత్నం

జన చైతన్య యాత్రను పోలీసులు అడ్డుకోవడం ఉద్రిక్తతకు దారితీసింది. మున్సిపల్ కార్యాలయం ఎదుట సభ కొనసాగుతున్న సమయంలో పోలీసులు వచ్చి అడ్డుకున్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్. వీరయ్య మాట్లాడుతున్న క్రమంలో డీఎస్పీ జీవన్‌రెడ్డితో పాటు పోలీసులు సభను అడ్డుకునే ప్రయత్నం చేశారు. పక్కనే కలెక్టర్ సమావేశం కొనసాగుతోందని మైక్‌సెట్లు నిలిపివేశారు. వాటిని ఉన్న వైర్లు, లైట్లను తొలగించారు. దీంతో వీరయ్యతో పాటు సభలో ఉన్న నాయకులు పోలీసుల తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. రాష్ట్ర డీజీపీ అనుమతి ఇచ్చిన తరువాత మీరెలా మా సభను ఆపుతారని ప్రశ్నించారు. మా వేదిక మీదకు మీరెలా వస్తారని, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మీ పోలీసులంతా పని చేస్తున్నారని, మేము బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ను విమర్శిస్తే మీరెందుకు ఉలిక్కి పడుతున్నారని ప్రశ్నించారు. నిర్మల్ పోలీసులు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు ముసుగుగా పని చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం దేశంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా పనిచేస్తుంటే మీరు బీజేపీకి అనుకూలంగా పనిచేస్తున్నారా అని పోలీసులను నిలదీశారు. నాయకులు, కార్యకర్తలు డీఎస్పీకి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, ఎస్.వీరయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు అడవయ్య, జయలక్ష్మి మాట్లాడుతూ సాయంత్రం 5 గంటల తరువాత సభ జరుపుకోమని స్థానిక జిల్లా కమిటీకి అనుమతినిచ్చారన్నారు. ఇప్పుడేమో ప్రభుత్వ కార్యాలయం పక్కనే ఉన్నందున కార్యకలాపాలకు ఆటంకం జరుగుతుందని సాకు చూపెట్టడం ఏంటని ప్రశ్నించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మూకలు పోలీసుల రూపంలో సభ మీద దాడి చేస్తూ అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. సాయంత్రం 5గంటల తరువాత ప్రభుత్వ కార్యాలయాలు ఉండవని చెప్పింది పోలీసులేనని ఈ సమయం తర్వాత సభ జరుగుతుంటే అడ్డుకోవడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు సంబంధించిన అంశాలు మాట్లాడుతూ ప్రజలను చైతన్యం చేసే మాటలు ప్రారంభం కాగానే పోలీసులకు లేని కర్తవ్యం గుర్తుకురావడం ఇందుకు నిదర్శమని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీలు ఎన్ని ఆటంకాలు సృష్టించినా జనచైతన్యయాత్రను అడ్డుకోలేరని తేల్చిచెప్పారు. అనంతరం పోలీసులు మైక్ కట్ చేయడంతో మైక్ లేకుండానే సభ కొనసాగింది. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్‌బాబు, జగదీష్, బాలకృష్ణ, అశయ్య, వెంకటేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, బొమ్మెన సురేశ్, జిల్లా కమిటీ సభ్యులు అరవింద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలకు పురస్కారాలు
నవతెలంగాణ-జన్నారం

మండలంలోని 29 గ్రామపంచాయతీలలో 15 గ్రామపంచాయతీలో ప్రజలకు ఉత్తమ సేవలు అందించినందుకు ఆ గ్రామపంచాయతీ సర్పంచులకు, కార్యదర్శులకు, మల్టీపర్పస్ వర్కర్స్, అంగన్వాడి, ఆశా కార్యకర్తలకు ఎమ్మెల్యే రేఖా నాయక్ ప్రశంసా పత్రాలు అందిస్తూ శాలువాలతో సన్మానం చేశారు. గురువారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామంలో 9 అంశాలలో ఎక్కువ మార్కులు సాధించిన పంచాయతీలకు, ప్రథమ బహుమతులు పొందిన లింగయ్యపల్లె, తిమ్మాపూర్, మురిమడుగు, పొన్కల్ గ్రామపంచాయతీ సర్పంచులకు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సర్పంచ్ నిధులను వెంటనే విడుదల చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మాదాడి సరోజన, వైస్ ఎంపీపీ సుతార్ వినయ్‌కుమార్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు జాడి గంగాధర్, పొన్కల్ సర్పంచ్ జక్కు భూమేష్, లింగాయపల్లె సర్పంచ్ బోర్లకుంట భాగ్యలక్ష్మి రాజన్న, మురికిమడుగు సర్పంచ్ ఇంధన్‌పల్లి భాగ్యలక్ష్మి రాజలింగు, దేవునిగూడ సర్పంచ్, గుర్రం శిరీష గోపాల్ రెడ్డి, జన్నారం సర్పంచ్ భూషణవేణి గంగాధర్‌గౌడ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మమ్మద్ రియాజుద్దీన్, ప్రేమ్‌సింగ్, తహసీల్దార్ కిషన్, ఎంపీడీవో అరుణారాణి, ఈవోపీఆర్డి రమేష్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పద్మ పాల్గొన్నారు.

జైపూర్ : గ్రామ పంచాయతీల వారీగా ప్రాధాన్యత క్రమంలో పంచాయతీ రాజ్ శాఖ అవార్డులు ప్రకటించింది. గురువారం ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ గోదారి రమాదేవి లక్ష్మన్, జెడ్పీటీసీ మేడి సునిత తిరుపతితో కలిసి అవార్డులు ప్రదానం చేశారు. 2022-23 సంవత్సరానికి సంబంధించి వివిధ అంశాలలో గ్రామ పంచాయతీ పరిపాలన తీరును పరిగణలోకి తీసుకుని మొదటి మూడు స్థానాల్లో గుర్తించారు. గ్రామ పంచాయతీ పరిధిలో మొత్తంగా తొమ్మిది అంశాల్లో గ్రామ పంచాయతీ పొందిన అర్హతను క్రోడీకరించి పంచాయతీరాజ్ శాఖ అవార్డులు ప్రకటించినట్లు ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ అనిల్ కుమార్ తెలిపారు. మండల పరిధిలో గల 20 గ్రామ పంచాయతీలలో పంచాయతీల నిర్వహణ తీరును పరిగణలోకి తీసుకుని అవార్డులు అందజేసినట్లు తెలిపారు.

దిలావర్‌పూర్ : దీన్ దయాల్ ఉపాధ్యాయ పంచాయతీ స్టేట్ వికాస్ పురస్కారాలలో భాగంగా గ్రామాలలో వివిధ విభాగాల్లో ఉత్తమ పనితీరు కనబరిచి మండలంలోని ఐదు గ్రామపంచాయతీలు జిల్లా స్థాయికి ఎంపియ్యాయి. మండల స్థాయిలో 9 గ్రామపంచాయతీలు ఉత్తమ గ్రామపంచాయతీ పురస్కారాలకు ఎంపికైన నేపథ్యంలో గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో సర్పంచులను, పంచాయతీ కార్యదర్శులను, మల్టీ పర్పస్ వర్కర్లను ఘనంగా సన్మానించారు. మండలంలోని బన్సపల్లి గ్రామ పంచాయితీకి 5 పురస్కారాలు రాగా, దిలావర్ పూర్ గ్రామానికి 2, గుండంపల్లి గ్రామానికి 3, కాల్వ గ్రామానికి 2, మాడెగాం గ్రామానికి 3, మాయాపూర్ గ్రామానికి 1, న్యూ లోలం గ్రామానికి 5, సాంగ్వి గ్రామానికి 3, సిర్గాపూర్ గ్రామానికి 3 ఉత్తమ పురస్కారాలు లభించాయి. ఈ సందర్భంగా ఉత్తమ పురస్కారాలు అందుకోబోతున్న గ్రామపంచాయతీల సర్పంచులను, పంచాయతీ కార్యదర్శులను శాలువా, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. అనంతరం డిపిఓ మాట్లాడుతూ పురస్కారాలను ఒక బూస్టర్‌గా వాడుకుని గ్రామాలను మరింత అభివృద్ధి చెందేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి తక్కల రమణారెడ్డి, ఎంపీపీ అక్షర అనిల్, ఎంపీడీవో మోహన్, ఎంపీఓ ఆజీజ్‌ఖాన్, గ్రామాల సర్పంచులు విరేష్ కుమార్, గుండ మధుకర్, సరిత రాజుపాల్గొన్నారు.

వృథా అవుతున్న తాగునీరు
నవతెలంగాన-రామకృష్ణాపూర్



అసలే ఎండాకాలం, నీరు లేక సతమవుతుంటే రాజీవ్ చౌక్ వ్యాపారస్తులు ఇలా నీరు వధా చేస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ చౌక్‌లో గతంలో వ్యాపారస్తుల సౌకార్యార్థం సింగరేణి సంస్థ ఇక్కడ మినీ నీళ్ల ట్యాంక్ ఏర్పాటు చేశారు. కానీ ఇక్కడి వ్యాపారస్తులు తమ అవసరాలకు నీరు తీసుకెళ్లి కోలాయిని బంధు చేయకుండా వెళ్తున్నారు. నీరు వధా చేయద్దని కొన్ని స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వాలు చెబుతున్నా, వ్యాపారస్తులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ విషయమై వ్యాపారస్తుల సంఘం అధ్యక్షులు చిదురాల రాజును వివరణ కోరగా రాజీవ్‌చౌక్‌లో తిరుగుతున్న పశువుల దాహం తీర్చడం కోసం కోలాయిని ఓపెన్ చేసి పెడుతున్నామని పశువుల కోసం నీటి తొట్టిని నిర్మించాలని మందమర్రి జీఎం చింతల శ్రీనివాస్‌కు గత సంవత్సర ఎండాకాలం దరఖాస్తు చేయగా అధికారులు పట్టించుకోలేదని, ఇప్పటికయిన సింగరేణి, మున్సిపల్ అధికారులు స్పందించి పశువులకు నీటి తొట్టిని ఏర్పాటు చేయాలని ప్రజల తరపున వ్యాపారస్థుల తరుపున కోరారు.

జనచైతన్య యాత్ర పోస్టర్లు విడుదల
నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పొన్కల్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని సుందరయ్య నగర్‌లో గురువారం సీపీఐ(ఎం) జన చైతన్య యాత్ర పోస్టర్లను ఆ పార్టీ నాయకురాలు మగ్గిడి జయ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాల పట్ల ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. కార్మిక హక్కులు, కార్మిక చట్టాల రక్షణ, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు, విద్యుత్ సవరణ బిల్లు 2022 ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో చేపట్టే యాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సుందరయ్య నగర్ కాలనీ మహిళలు పాల్గొన్నారు.

టేకు కలప నిల్వ చేసిన వ్యక్తికి రిమాండ్
నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ టైగర్ జోన్ తాళ్లపేట అటవీ రేంజ్ పరిధిలోని తపాలాపూర్ గ్రామానికి చెందిన మామిడి భూమన్న అక్రమంగా టేకు కలప నిల్వ ఉంచినందుకు అటవీశాఖ అధికారులు పట్టుకొని లక్సెటిపేట కోర్టులో ప్రవేశపెట్టారు. దీంతో న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు తాళ్లపేట ఎఫ్ఆర్ఓ రత్నాకర్‌రావు తెలిపారు. టేకు చెట్లను నరికి ఇంటి వద్ద నిల్వ చేసుకొని అమ్ముకునేవారన్నారు. గతంలో పలుమార్లు హెచ్చరికలు జారిచేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో కోర్టులో జడ్జి ముందు హాజరు పరిచామని ఎఫ్ఆర్ఓ పేర్కొన్నారు.

సంతులిత పోషకాహారం తీసుకోవాలి
నవతెలంగాణ-తాండూర్

సంతులిత పోషకాహార తీసుకొని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మమత తెలిపారు. ఆమె గురువారం మండలంలోని చౌటపల్లి గ్రామపంచాయతీ అంగన్వాడీ సెంటర్‌లో పోషన్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఆహారంలో భాగంగా రాగులు సజ్జలు జొన్నలతో పాటు తాజా కూరగాయలను వాడాలని తెలిపారు. ప్రతి కుటుంబం తన ఇంటి ఆవరణలో పెరటి తోటల పెంపకం చేపట్టాలన్నారు. ఆర్గానిక్ కూరగాయలు వాడడం వల్ల ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చీమల శంకర్, సూపర్‌వైజర్ మమత, వార్డ్ మెంబర్ చంద్రకళ, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట ఏడుగురు అటవీ నేరస్తుల బైండోవర్
నవతెలంగాణ-జన్నారం

తహసీల్దార్ కిషన్ ఎదుట ఏడుగురు అటవీ నేరస్తులను అధికారులు గురువారం బైండోవర్ చేశారు. కవ్వాల్ టైగర్ జోన్‌లోని ఇందన్‌పల్లి గ్రామం నుంచి ముగ్గురు, జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని గోండ్‌గూడ నుంచి నలుగురిని తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. అడవిలో అక్రమంగా చెట్లను నరకడం, కలప రవాణా చేయడం ఇతర అటవీ నేరాలకు పాల్పడిన ఏడుగురిని తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. ఇకముందు అటవీ నేరాలకు పాల్పడితే లక్ష రూపాయల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఫ్‌బీఓ రహిముద్దీన్, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఐబీ వార సంతకకు వేలంపాట
నవతెలంగాణ-తాండూర్

తాండూరు మండలం కొత్తపెల్లి పంచాయతీ పరిధిలోని శనివారం నిర్వహించే ఐబీ వార సంతకు గురువారం ఎంపీఓ సత్యనారాయణ వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటలో మండల పరిసర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు పాల్గొన్నారు. కూరగాయల సంతను బెల్లంపల్లికి చెందిన తెలపోయిన సంతోష్ రూ.4.90 లక్షలకు దక్కించుకున్నాడు. మేకల సంత సంవత్సరానికి గాను రూ.13.30 లక్షలఉ బోయిన తిరుపతి దక్కించుకున్నారు ఈ వేలంపాట కార్యక్రమంలో కొత్తపల్లి సర్పంచ్ ఏల్పుల రజిత రాజు పాల్గొన్నారు

శనగ కొనుగోళ్లు ప్రారంభం
నవతెలంగాణ-జైనూర్

మండల కేంద్రంలో సహకార సంఘం ద్వారా ఏర్పాటు చేసిన శనగ కొనుగోలు కేంద్రాన్ని గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు మార్కెట్ కమిటీ కార్యదర్శి సయ్యద్ అజాంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన అన్ని రకాల పంటలు కొనుగోలు చేస్తుందని తెలిపారు. మండల పరిధిలోని రైతులు ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరకు దిగుబడులను విక్రయించి లాబాలు పొందాలని అన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ కొడప హన్నుపటేల్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఇంతియాజ్‌లాల, సర్పంచ్‌లు మెస్రం పార్వతి లక్ష్మణ్, మడావి భీంరావు, మండల కోఆప్షన్ సభ్యుడు అఫ్రోజ్‌ఖాన్, మాజీ ఎంపీపీ కొడప దమ్మీ పటేల్, బీఆర్ఎస్ నాయకులు సలీంఖాన్, జాడి రవీందర్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదిముబారక్ దేశానికే ఆదర్శం
నవతెలంగాణ-మంచిర్యాల

కల్యాణలక్ష్మీ, షాదిముబారక్ పథకం దేశానికి ఆదర్శమని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో 80 మంది లబ్దిదారులకు కలాణలక్ష్మి, షాది ముబారక్ రూ.80,09,280 విలువ గల చెక్కులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య పాల్గొన్నారు.

మురళీగూడలో వైద్యశిబిరం



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని మురళిగూడ గిరిజన గ్రామంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా 71 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఏడుగురికి జ్వరాలు ఉండడంతో రక్త నమూనాలు సేకరించినట్టు హెల్త్ సూపర్‌వైజర్ రవిదాస్ తెలిపారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పొరిశెట్టి ఈశ్వరి, ఉప సర్పంచ్ ప్రభాకర్, ఏఎన్ఎం లక్ష్మి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక
నవతెలంగాణ-బెజ్జూర్

తెలంగాణ జాతీయ వినియోగదారుల మానవ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గురువారం మండలకేంద్రంలో రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ సహరభాను అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడిగా జె సందీప్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గంగినేని రామయ్య, జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా మహేష్, జనరల్ సెక్రటరీగా ఓం ప్రకాష్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో సందీప్, గాడే సుభాష్ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షల షెడ్యూల్ విడుదల
నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఓపెన్ స్కూల్ విధానంలో పదవ తరగతి, ఇంటర్ పరీక్షలకు సంబంధించి అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు పరీక్షల షెడ్యూల్ విడుదలైందని జిల్లా విద్యాశాఖాధికారిణి ప్రణీత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ 25 నుండి మే 4 వరకు ఉదయం 9గం.ల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుండి 5.30 గంటల వరకు ఉంటుందన్నారు. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు మే 12 నుండి మే 19 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు జనచైతన్య యాత్ర బహిరంగ సభ

- సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి ముంజం ఆనంద్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

బీజేపీ మతోన్మాద, కార్పోరేట్ విధానాలు వ్యతిరేకిస్తూ, సంక్షేమం, మతసామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న జనచైతన్య యాత్ర బహిరంగ సభ శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలో నిర్వహించనున్నట్టు సీపీఎం పట్టణ కార్యదర్శి ముంజం ఆనంద్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు జైనూర్ మండలం ఆశేపల్లి చౌరస్తా మీదుగా చైతన్య యాత్ర జిల్లాకు చేరుకుంటుందన్నారు. సాయంత్రం జిల్లా కేంద్రంలో ప్రెస్ మీట్ అనంతరం 4.30 గంటలకు కాగజ్‌నగర్ చెక్ పోస్ట్‌కు చేరుకుంటుందని తెలిపారు. అక్కడ స్వాగతం పలికిన అనంతరం అంబేద్కర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ ఉంటుందని తెలిపారు. 5 గంటలకు బహిరంగ సభ ఉంటుందన్నారు. ఈ సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. వీరయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.జయలక్ష్మి, బండారు రవికుమార్, లెల్లల బాలకృష్ణ, టి. స్కైలెబ్ బాబుతో పాటు జిల్లా కార్యదర్శి కూశన రాజన్న ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సభకి పట్టణ ప్రజలు, కార్మికులు, విద్యార్థులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



బెజ్జూర్‌లో..

బెజ్జూర్ : కార్మికుల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం సాయంత్రం 4 గంటలకు కాగజ్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద నిర్వహించే జన చైతన్య యాత్ర బహిరంగ సభను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు వెలిశాల కృష్ణమాచారి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు పంచాయతీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బహిరంగ సభలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మితో పాటు ఇతర ప్రజా సంఘాల నాయకులు హాజరవుతారన్నారు. కార్మికుల హక్కుల సాధనకు సీఐటీయూ పోరాడుతుందన్నారు. ఈ సభకు అన్ని రంగాల కార్మికులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ గోరంట్ల వసంత్, సలీం, ఎండీ అజీస్, తిరుపతి, తార, పుష్ప, మల్లయ్య, రమేష్, నాగేష్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ప్రజా పంపిణీ పర్యవేక్షణకు కమిటీ ఏర్పాటు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

పౌర సరఫరాలో ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వం విజిలెన్స్ కమిటీని ఏర్పాటు చేసింది. పౌరసరఫరా శాఖ ద్వారా నిర్వహించే సరకుల పంపిణీ పర్యవేక్షణతో పాటు ఇకపై ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాల ఫలాలు అందుతున్నాయా లేదా అన్న అంశాలను కమిటి సభ్యులు పర్యవేక్షించనున్నారు. ఫుడ్ అడ్వైజరీ కమిటి గానూ విజిలెన్స్ కమిటి సభ్యులు పని చేయనున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం గురువారం జిల్లా విజిలెన్స్ కమిటి సభ్యులను ప్రభుత్వం ప్రకటించింది. విజిలెన్స్ కమిటీలో ఆర్డీఓను చైర్మన్‌గా నియమించగా తహసీల్దార్లు, మున్సిపల్ కమీషనర్, జడ్పీటీసీలు, సంక్షేమ శాఖల అధికారులు, డిప్యూటీ తహసీల్దార్‌లను సభ్యులుగా నియమించారు. అదేవిధంగా జైనథ్ మండలం గూడ ఎంపీటీసీ తోట రామ, బేల మండలం సాంగిడి ఎంపీటీసీ కుంట రాకేశ్‌తో పాటు నేరడిగొండకు చెందిన మేస్రం జంగుబాయి, ఆదిలాబాద్ పట్టణానికి చెందిన మర్రి విజయ, తార్వే తులసిలు కమిటీలో సభ్యులుగా నియమితులయ్యారు.

త్వరలోనే సమస్యలన్నీ పరిష్కరిస్తా

నవతెలంగాణ-దహెగాం

త్వరలోనే గ్రామాల్లో నెలకొన్న సమస్యలన్నింటినీ పూర్తిగా పరిష్కరిస్తానని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. గురువారం మండలంలోని కొత్మీర్, జెండగూడ, బీబ్రా తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ రోడ్ల శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. అలాగే జెండగూడ గ్రామానికి బీటీ రోడ్డు మరమ్మత్తులతో పాటు వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు సంతోష్‌గౌడ్, వైస్ ఎంపీపీ చౌదరి సురేష్, నాయకులు బండ కృష్ణమూర్తి, దందెర వెంకన్న, పాపయ్య, షేక్‌హుస్సేన్, లక్ష్మణ్, మల్లేష్ పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీ సర్పంచ్‌లకు సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

జిల్లాస్థాయిలో ఎంపికైన గ్రామాలు చాంద(టి), బట్టి సావర్గాం మండల స్థాయిలో ఎంపికైన 16 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు, కార్యదర్శులకు గురువారం మావల మండలకేంద్రంలోని రైతువేదికలో ఎమ్మెల్యే జోగు రామన్న సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం కక్ష్య పూరితంగా వ్యవహరిస్తోందని అన్నారు. అనంతరం పలువురు లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆదిలాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపికైన గ్రామాల సర్పంచ్‌లకు, కార్యదర్శులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గండ్రత్ రమేష్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు రాగం గంగమ్మ, ద్గొగలి ప్రమీల, మాడావి మయూరి, దుర్వ రామచందర్, యాదవ రావ్, విలాస్, లక్ష్మణ్, వైస్ ఎంపీపీ గోవర్ధన్ రెడ్డి, ఎంపీటీసీ జంగుబాపు, ఎంపీడీఓ అరుణ, ఎంపీఓ లక్ష్మణ్, బీఆర్ఎస్ నాయకులు నల్ల రాజేశ్వర్, రాగం గోవర్ధన్, ముక్కెర మహేందర్, అజీమ్, సుధీర్, ఉమాకాంత్ రెడ్డి, అశోక్, విజయ్, నారాయణ, విలాస్‌రెడ్డి, సృజన్, అభిమాన్, సంతోష్, గంగన్న పాల్గొన్నారు.

దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతదే

నవతెలంగాణ-నిర్మల్

అవినీతి, మతోన్మాదం, స్వార్థపూరిత పాలకుల నుండి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతదేనని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కే. రాజన్న అన్నారు. భగత్ సింగ్, రాజగురు, సుఖ్‌దేవుల 92వ వర్ధంతి సభను గురువారం జిల్లా కేంద్రంలోని ప్రజా పంథా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. భగత్ సింగ్ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకొని, అవినీతి, రాజకీయ, పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని అన్నారు. దేశంలో జరుగుతున్న మతం, మాదారులపైన అవినీతి పాలన పైన, మనుషులను విడదీసే మతోన్మాద పాలకులు, ప్రశ్నించే వాళ్లను చంపుతూ, మానవ, రాజ్యాంగం హక్కులను కాలరాస్తూ, కార్పొరేట్ పెట్టుబడిదారులకు దేశ సంపదను ప్రస్తుత ప్రభుత్వాలు దోచిపెడుతున్నాయని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదని అన్నారు. చదువును వ్యాపారమయం చేశారని అన్నారు. రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. మహిళలపై రోజురోజుకు దాడులు పెరుగుతూనే పోతున్నాయని



అన్నారు. ఇలాంటి పరిస్థితిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అబద్దాలు అందంగా చెబుతూ ఉంటే యువత మాత్రం వాటిని ప్రశ్నించే పరిస్థితి లేదన్నారు. యువత వీరి భ్రమలో నుండి బయటికి రావాలని, దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత వారి పైన ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు బక్కన్న, పీఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి కట్ల లక్ష్మీ , ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి మహిమూద్, నాయకులు గంగన్న, లక్ష్మీ, బైరి పోశక్క, రుక్మ ఉత్తం, రాజు, చిన్నయ, నరేందర్, మురళీ పాల్గొన్నారు.

దేశానికే తలమానికంగా నిలవాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

అభివృద్ధిలో మండలాన్ని దేశానికే తలమానికంగా నిలువాలని ఎంపీపీ అడ్డూల పద్మ రమేష్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ స్థాయిలో వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన గ్రామ పంచాయతీలకు అవార్డులు, ప్రశంస పత్రాలు అందజేశారు. అత్యధికంగా పొట్టపెల్లి (కె) గ్రామానికి జాతీయ స్థాయిలో 7 అవార్డులు లభించడం పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హర్షం వ్యక్తం చేశారు. పొట్టపెల్లి (కె) గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీపీ అన్నారు. అభివృద్ధిలో పోటీ పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్, ఎంపీఓ నసీరుద్దీన్, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఉపవాస దీక్షలు కొనసాగించాలి

నవతెలంగాణ-ఇచ్చోడ

రంజాన్ పండుగ సందర్భంగా ప్రశాంతంగా ఉపవాస దీక్షలు కొనసాగించాలిని ఉట్నూర్ డీఎస్పీ సీహెచ్ నాగేందర్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో 5 మసీదు కమిటీల సభ్యులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎల్లవేళల ప్రజలకు పోలీసుల సహకారం ఉంటుందన్నారు. శాంతియుత వాతావరణం రంజాన్ ఉపవాస దీక్షలు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ సీఐ నైలు, ఎస్సై నీరేష్ ప్రజలు పాల్గొన్నారు.

బాసర ఆలయా అభివృద్ధికి ముందడుగు

బాసర : బాసర ఆలయ అభివృద్ధికి ముందడుగు పడింది. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.50 కోట్లలో రూ.8 కోట్లతో ఆలయ ప్రాంగణంలో షెడ్లు, ఏసీ వసతి భవనాలపై గదుల నిర్మాణానికి వెచ్చించారు. మిగిలిన రూ.42 కోట్లతో ఆలయాన్ని పునర్నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో ముందుగా గర్భాలయ పనులను వెడల్పు చేసేందుకు ఆలయ అర్చకులు స్థాపతి, ఇంజనీరింగ్ అధికారులు హంపి పీఠాధిపతి అనుమతులు తీసుకున్నారు. ముందుగా గర్భాలయ పనులను కృష్ణ శిలలతో నిర్మించి, ప్రాకార మండపాలు, రాజగోపురాలు, మహాకాళి, దత్తాత్రేయ, శివాలయం నిర్మించనున్నారు. ఆలయ పునర్నిర్మాణ పనుల దృష్ట్యా అమ్మవార్లకు బాలాలయా ఏర్పాటుకు ఆలయ అర్చకులు వేద పండితులు అనువైన స్థలాన్ని ఎంపిక చేయనున్నన్నారు. వీటితోపాటు ప్రత్యేకంగా క్యూకాంప్లెక్స్, రూ.1వెయ్యి ప్రత్యేక అక్షరాభ్యాస మండపం, రూ.150మండపం నిర్మించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులు త్వరగా పూర్తయితే భక్తులకు ఇబ్బందులు తీరే అవకాశం ఉంటుంది. అమ్మవారి జన్మదినం వసంత పంచమి, నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. తమ చిన్నారులకు అమ్మవారి సన్నిధిలో అక్షరాభ్యాస పూజలు జరిపించేందుకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు పోటెత్తుతారు. ఇందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అభివృద్ధి పనులు చేసేందుకు ముందుకు రావడంతో స్థానికులు భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు

పాఠశాలకు స్మార్ట్‌టీవీ బహూకరణ

నేరడిగొండ : మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాల తర్ణం(కె) గ్రామవాసి పూర్వ విద్యార్థి, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు బబ్బిలి సుధాకర్ తాను చదివిన పాఠశాలకు తన వంతు సాయంగా రూ.16వేలు విలువగల స్మార్ట్ టీవీ అందించారు. విద్యార్థులకు డిజిటల్ పాఠాలు నేర్పడంలో టీవీ అవసరం ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్ తెలియజేయడంతో తక్షణమే స్పందించి స్మార్ట్‌టీవీని ఇచ్చి తన ఉదరతను చాటుకున్నారు. ఆయనను పాఠశాల యజమాన్య కమిటీ సన్మానించింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విశాల్, ప్రధానోపాధ్యాయులు రవికుమార్, పాఠశాల చైర్మెన్ కామేరి సుధాకర్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, ఉపాధ్యాయురాలు భవిత, మాయ, మాజీ ఎస్ఎంసీ చైర్మెన్ అడెల్లు, గంగాధర్, వెంకటరమణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముధోల్ తహసీల్దార్‌కు సన్మానం

నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రానికి చెందిన బోగడ వాడకట్టు మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఇటీవల ముధోల్ తహసీల్దారుగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన తుకారామ్‌ను గురువారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముధోల్ తాలూకా మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు రోల్లా రమేష్‌తో పాటు మండల కార్యవర్గ సభ్యులు పడమటి సాయిలు, భూమన్న, వెంకటాపురం గణపతి, రోల్లా బాలాజీ, ధర్మన్న, రాములు, శంకర్, గంగాధర్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీకి జైలు శిక్ష విధించడం సరికాదు

నవతెలంగాణ-ఉట్నూర్

ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీకి రెండేండ్ల జైలు శిక్ష విధించడం సరికాదని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు అన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీకి సూరత్ కోర్టు పరువు నష్టం కేసులో రెండేండ్ల జైలు శిక్ష విధించడం పట్ల గురువారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో మౌన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వెడ్మ బొజ్జు 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల సభలో మోడీ గురించి ఆరోపణలు చేసిన నేపథ్యంలో కేసు వేశారని, సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పు వెంటనే కొట్టి వేయాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఎవరు మాట్లాడినా వారందరికి శిక్షలు విధించడం సరికాదన్నారు. ప్రతి పక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి, ఉద్యోగ సంఘాలు అన్ని ఏకం కావలసిన అవసరం ఎంతైన ఉందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్, దేశంలో మోడీ ఇద్దరు కలిసి ప్రజాస్వామ్యాన్ని దోచుకుంటున్నరన్నారు. అదే విధంగా మీడియాను అణిచివేతకు గురి చేయడం దారునమన్నారు. వెంటనే రాహుల్ గాంధీకి విధించిన జైలు శిక్షను రద్దు చేయాలని ఆయన కోరారు.

ఘనంగా షాహిద్ దివస్

ముధోల్ : మండల కేంద్రంలోని రబీంద్రా ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా షాహిద్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరం కొరకు అమరులైన భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్ గురుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి త్యాగాల గురించి విద్యార్థులకు వివరించారు. దేశం కొరకు వారు పోరాడిన పటిమను గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాయినాథ్, కరస్పాండెంట్ రాజేందర్, ఉదయ్, లవణ్ బాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.